

ఆదివారం
ప్రజాశక్తి
మే 15, 2005

ప్రపంచ కుటుంబ దినోత్సవం



15-5-2005 నుంచి
21-5-2005 వరకు

హ్యాపీ బర్త్‌డే

ఉప్పలపాటి క్రాంతి
4సం॥, 12-5-2001
శాంతా కుమారి-రామరాజు
కొత్తపేట-విజయవాడ

కరణం షాలికాసాయి
3సం॥, 13-5-2003
లక్ష్మి-గురుమోహన్
తూనుగుంట-ప్రకాశం జిల్లా

జ్ఞానేంద్ర సాయి లక్ష్మణ్
5సం॥, 14-5-2001
భగవతి - లక్ష్మణరావు
రవీంద్రనగర్-కాకినాడ

ఎన్. సమరసింహారెడ్డి
3సం॥, 16-5-2002
నీలిమా-భీమార్జున్ రెడ్డి
విద్యానగర్ కాలనీ-నల్గొండ

నవీన్‌కుమార్
6సం॥, 16-5-2002
లక్ష్మి-ముత్యాలు
దేవరకొండ-నల్గొండ

తరుణ్ తేజా గౌడ్
8సం॥, 21-5-1997
ఉమా-శ్రీనివాస్ గౌడ్
మర్రిగూడ-నల్గొండ

కావ్య
1సం॥, 21-5-2004
ఉషారాణి-కృష్ణమోహన్
ఏలూరు-పశ్చిమగోదావరి

ప్రమోద
13సం॥, 14-5-1992
పద్మావతి-రామ్‌ప్రసాద్
భద్రాచలం-ఖమ్మం జిల్లా

ప్రవీణ
11సం॥, 14-5-1994
పద్మావతి-రామ్‌ప్రసాద్
భద్రాచలం-ఖమ్మం జిల్లా

జి. అంజి
2సం॥, 14-8-2003
పోసాని-కనకయ్య
జులంపల్లి-కరీంనగర్ జిల్లా

అష్రఫ్ అలి
1సం॥, 15.5.2004
సఫియా-చాంద్‌పాషా
బెల్లంపల్లి-ఆదిలాబాద్

అన్వేష్
1సం॥, 16.5.2004
అనిత-మధు
కోల్‌కొండ-వరంగల్

లిఖిత
మే-16
కరుణ-రామకృష్ణ
కొత్తగూడెం-ఖమ్మం

శశిధర్‌రెడ్డి
4సం॥, 19.5.2001
విజయలక్ష్మి-విశ్వనాథ్‌రెడ్డి
రాచర్ల-ప్రకాశం



లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం



సమ్మర్ హాలిడేస్

1వ తేదీ కవర్‌స్టోరీ విలక్షణంగా రాశారు. బాగుంది. కేవలం టూరిస్ట్ సమాచారంతోనే సరిపెట్టకుండా వివరణాత్మకంగా రాయడం బాగుంది. అలాగే కచ్చితంగా మా పిల్లల శలవులిచ్చిన సందర్భంగా వచ్చిన ఈ ఆదివారం సంచిక మాలాంటివాళ్ళకోసమే ప్రచురించారా అన్నంతగా ఫీలయ్యాం. ఫొటోలు ఇంకా వేస్తే బాగుండేదనిపించింది. ప్రతీవారంలాగే కాకుండా ఇంకొన్ని పేజీలు ఎక్కువవేసి, ఇంకా ఎక్కువ ప్రాంతాల గురించి రాస్తే ఇంకా బాగుండేది.

-ఆర్ క్రిష్ణమూర్తి, రావినూతలపాడు,
ప్రకాశంజిల్లా

హాలిడేస్...జాలీడేస్

శలవులను ఎలా గడపాలి? ఎక్కడెక్కడికెళితే ఏమేమి చూడొచ్చు అనేది చక్కగా వివరించారు. అదికూడా మా లాంటి మధ్యతరగతివాళ్ళం పిల్లల కోరికలు, మా జేబు సత్తాకు లంకె కుదిరేలా ఏఏ ప్రాంతాలను ఎంచుకోవచ్చో రాశారు. అలా రాయడం బాగుంది. మా ఇంట్లోవాళ్ళు కూడా ఆ వ్యాసం చదివి బాగుందన్నారు. మా కర్నూల్‌జిల్లాలో కూడా అనేక పిక్నిక్ స్పాట్‌లున్నాయి. వాటి గురించి కూడా రాస్తే బాగుండేది.

జి వెంకట్రామిరెడ్డి,
ఆదోని, కర్నూల్‌జిల్లా

శలవుల ప్రయాణాలకూ అర్థం

కొన్ని పత్రికలు ఇలాంటివి రాశారు. కానీ ప్రజాశక్తి ఎంచుకున్న వ్యాసవిధానం విలక్షణంగా ఉంది. శలవులకంటూ అర్థం ఉంది అని రాసిన భాగంలో శలవులను ఎలా గడపాలి అనేదానికి కొంత మానవీయకోణం ఉండటం అవసరం అని పేర్కోవడం మమ్మల్ని ఆలోచింపజేసింది. పట్టణాల్లో ఉద్యోగాలు చేసే బిడ్డలు తమ బిడ్డలతో మన ఊరొస్తారని ఎదురుచూసే ముసలి తల్లిదండ్రులుంటారని ఎంతో బాగా గుర్తుజేసింది ఈ కవర్‌స్టోరీ.

జె రాధాకృష్ణ మూర్తి,
ఖైరతాబాద్, హైదరాబాద్

కవర్‌స్టోరీ టూరిస్ట్‌గైడ్

కవర్‌స్టోరీ లోని వేసవి శలవుల పర్యటనా ప్రాంతాలు, టూరిస్ట్‌గైడ్‌లోని రాజస్థాన్‌లోని అద్భుత కట్టడాల జైపూర్ కోట గురించి రాసినది ఈ సంచికకు హైలైట్‌గా ఉంది. వీటితోపాటు సంచికలోని ఇతర రచనలు ఒకదానితో ఒకటి పోటీపడుతున్నట్లున్నాయి.

-సిరిపురపు రామకోటేశ్వరరావు,
ఎనికేపాడు, విజయవాడ రూరల్

కథ విలక్షణంగా ఉంది



ఈ సంచికలోని 'పాయఖానా పోయె...టాయిలెట్లు వచ్చె' కథ చాలా విలక్షణంగా, ఇప్పుడొస్తున్న వాటిలో భిన్నంగా ఉంది. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ భూతం పాకీదొడ్లను కూడా వదిలిపెట్టదన్న వాస్తవం చక్కగా చెప్పిన కథ ఇది. ఆ కథలో ఆయా కులానికి చెందిన రెల్లి కులస్థుల భాషలో అక్కడక్కడ కనీసం ఊతపదాలుగా వాడేవాటినన్నా పెడితే ఇంకా సహజంగా ఉండేది. మొత్తంమీద మంచి కథ మేడే నాడు మేము చదివాం అనిపించింది.

యర్రమోతు ధర్మరాజు,
చిట్యాల మండలం, నల్లగొండజిల్లా

బడాయి పై లడాయి

ఈ వారం ఇంతిసంగతులు శీర్షికలో 'బడాయి పై లడాయి' రచన చాలా చక్కగా సాగింది. విషయంతో పాటు హాస్యం కూడా సమపాళ్ళలో మేళవించుకుని సాగింది. బడాయి పై ఆ ఇంటి ఇంతి మాత్రమే కాదు అతగాని చేతిలోని రేజరు చేత కూడా చేయించడం హాస్యపూరితంగా ఉంది. మమ్మల్ని బాగా నవ్వించింది. ఇలాంటి చక్కని రచనలు అందిస్తున్న ప్రజాశక్తికి అభివందనలు.

ఎస్ లక్ష్మి, పెజ్జోనిపేట,
వన్ టౌన్, విజయవాడ

కొండమీది కొంగలు

బాలకథ కొండమీది కొంగలు చక్కని నీతిని బోధించాయి. అంతేకాదు, మనిషి మోసకారితనాన్ని కొంగల తీరులో భలే ఆరోపణ చేయించారు. మనిషి చాలా ప్రమాదకారి అని కొంగలు అనడం మనలోని మోసకారితనానికి చురకలాంటిది. ఈ కథ చిన్నపిల్లలకే కాదు పెద్దవాళ్ళకు కూడా మంచి కథే.

జె జహంగీర్, రాపూరు, నెల్లూరుజిల్లా

ముహూర్తాలూ...ములక్కాడలు

24వ తేదీ సంచికలోని ఇంతి సంగతుల్లోని కథ మమ్మల్ని ఎంతగానో నవ్వించింది. ముహూర్తాల పేరుతో పోయే చాదస్తాల పాలిట విసురు బాగుంది. జీవనశైలిలో మీటింగ్స్...ఈటింగ్స్ రచన బాగుంది. సభాప్రాంగణాలలో సభికులకు ఎటువంటి అనుభవాలెదురౌతాయో భలే వివరించారు. కవర్‌స్టోరీ నవరత్నాల వారసత్వం ప్రకాశ్ కరత్ వ్యాసం కూడా బాగుంది.

ఎం లలిత, కంచరాం,
శ్రీకాకుళంజిల్లా

కుటుంబం హాంఫట్!

ఇప్పటి మాంత్రికుడు మహా మాంత్రికుడు. ఒట్టి మాంత్రికుడు కాదండీ...యంత్ర మాంత్రికుడు.

మెజీషియన్ల చేతిలో మంత్రదండం కంపల్సరీ కదా! దానిమీదనే మన చూపు వుండేట్టు చేసి...హస్తలాఘవం చేసేసి మాయలు చేస్తాడు.

ఇప్పటి మన ఇంటర్నేషనల్ మహామాంత్రికుడి చేతిలో అలాంటి మంత్రదండమే ఉంది. అది యంత్రదండం...యంత్రమంత్రదండం. యంత్ర తంత్ర మంత్ర దండం. ఏ తీగెల అనుబంధాలూ లేని వైర్‌లెస్ దండమన్నమాట.

రిమోట్ కంట్రోలు గుర్తొచ్చిందా!? ఏంచేస్తాం చెప్పండి...వాటి గుణం ఒక్కటే కదా!

ఏ బంధాలూ...వైర్ల అనుబంధాలు లేని ఈ యంత్ర మంత్ర దండం ఎలియాస్ రిమోట్‌తో సదరు మాంత్రికుడు మార్కెట్టులో నిలబడ్డాడు. మంత్రదండం తిప్పి ఈ ప్రపంచంపై వల...అదేలేండి నెట్ విసిరి హాం ఫట్ అన్నాడు. అంతే ప్రపంచం అంతా కుగ్రామం అయిపోయింది పొమ్మన్నాడు.

గ్రామాల్లా...మరీ కుగ్రామాల్లా అయితే మనుషులూ దగ్గరదగ్గరై వారిలో మమతలు మరింతగా అల్లుకుంటాయేమోనని ఆశపడతారేమో....

'అనుబంధం ఆత్మీయత అంతా ఒక బూటకం...ఆత్మతృప్తికై మనుషులు ఆడుకునే నాటకం... వింత నాటకం" అనే మన పాత పాటకు రిమిక్స్ మసాలా వేసి డిజిటలైజ్ చేసిపారేశాడు.

అన్నీ మార్కెట్టులో దొరుకును అని మెనూ తగిలించాడు. ఆ సూపర్‌మార్కెట్టులో ముందే మనకు తెలియకుండా కంప్యూటరీ తూకం వేసేసి, ప్యాకెట్లుప్యాకెట్లుగా అమ్మకానికి రెడీ చేశాడు.

ఆవాలు వందగ్రాముల, రెండొందల గ్రాముల సాచెట్లున్నాయి గానీ ఓ పదిగ్రాముల ఆప్యాయత, ఐదుగ్రాముల అనురాగం, ఒక్క గ్రాము అనుబంధం వుంటుందేమో వెతుకుదామా?!

ఈ యంత్ర తంత్ర మంత్ర దండ మాంత్రికుడు వాటినీ మార్కెట్టు చేయాలనే చూస్తున్నాడు మరి.

కానీ నిజంగా అవి దొరికేది కుటుంబంలో. అమ్మకాలకూ, కొనుగోలుకూ అందని కుటుంబ జీవన విరితోటలో...

"అమ్మా-నాన్నా, అత్తా-మావ, పిన్ని-బాబాయి, చెల్లి-తమ్ముడు, అక్కయ్యా-అన్నయ్యా" ఇంతటి కమ్మనైన పంటనిచ్చే కుటుంబమనే పంటపొలాన్ని చక్కగా సాగుచేసుకోకపోతే...

"ఆ...రండి బాబూ రండి. వేడీవేడీ బజ్జీ మసాలా...హాట్ హాట్ పిజ్జా బర్గర్‌లు...వంకాయలు, బీరకాయలు, దోనకాయలు, ప్రేమానురాగాలు-ఆప్యాయతలో...చుట్టరికాలు-బంధుత్వాలో...కుటుంబ సంబంధాలు- మానవీయ విలువలో...చౌక చౌక..." అంటాడు ప్రపంచ మహామాంత్రికుడు.

ఆ తరువాత లబోదిబోమన్నా...ఆ ఏడుపుకీ పేటెంటు బిల్లు కట్టమంటాడు. ఆ కన్నీళ్ళలో ఉన్న ఉప్పు నాదేనంటాడు.

❀

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం...	5
కవర్ స్టోరీ	6
బాలలకథ	11
బాలనేస్తాలు	12
బాలనేస్తాలు	12
జీవనశైలి	16
నువ్వుద్ది	17
ఆరోగ్యం	18
పుస్తక పరిచయం	20
న్యాయసలహాలు	24

ఇంకా...



"విడిపోయి... కలిసుందాం"

కథ ... 9, 10



తానే ఓ కుటుంబం

రియల్ స్టోరీ ... 14, 15

సినిమాల్లో ఓ కుటుంబం

కళాసాహితి ... 22, 23

K.V.R. B.Com., B.L., (Director)

SPEAK ENGLISH FLUENTLY

తెలుగు తెలిస్తే చాలు...

మీరు ఇంట్లోనే ఉండి సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి!

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న ఇంగ్లీష్ కోర్సు మరి మీరూ...

స్టూడెంట్ అభిప్రాయం

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ ఫ్లూయెంట్‌గా మాట్లాడలేకపోయేవాడిని. నాకు ఒక మిత్రుని సలహా లభించి కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ తెప్పించి చదివాను. కేవలం ఒక్క నెలరోజుల్లోనే చక్కగా ఇంగ్లీష్ మాట్లాడగలుగుతున్నాను.

– జె.వి.రావు, విజయవాడ.

ఈ కోర్స్‌తో 25 గిఫ్ట్ పుస్తకాలు ఉచితం!

1. హిందీ స్పీకింగ్ కోర్సు 2. తమిళ్ స్పీకింగ్ కోర్సు 3. కన్నడ స్పీకింగ్ కోర్సు 4. మలయాళం స్పీకింగ్ కోర్సు – ఇలా 12 భారతీయ భాషలు (12 ఇన్ 1 పాకెట్ సైజులో) 1. ఇంగ్లీష్ డిక్షనరీ 2. వర్డ్ పవర్ 3. లెటర్ రైటింగ్ ప్రాక్టీస్ 4. వెర్బ్స్ డిక్షనరీ 5. సినానిమ్స్ & యాంటోనిమ్స్ డిక్షనరీ. (5 ఇన్ 1 పాకెట్ సైజులో) 1. ఈజీ మనీ ఎర్నింగ్ కోర్సు 2. సీక్రెట్ మ్యాజిక్ కోర్సు 3. [illegible] కోర్సు 4. బ్యూటీ ట్రీట్‌మెంట్ కోర్సు 5. సక్సెస్‌ఫుల్ ఎగ్జామినేషన్ కోర్సు 6. యోగా కోర్సు 7. పా 'మిస్టరీ' కోర్సు 8. కిచెన్ ట్రీట్‌మెంట్ కోర్సు (8 ఇన్ 1 పాకెట్ సైజులో) గిఫ్ట్ పుస్తకాలు సైజు 9 cm X 11 cm లోపు. కోర్సు మెటీరియల్ సైజు 18cm x 24cm లోపు ఉంటాయి. *ఈ ఇంగ్లీష్ కోర్స్ తర్వాత మరో నాలుగు నెలల కోర్సు కూడా ఉంది. ఈ కోర్సులు అతి తక్కువ నిర్ణయించిన నామమాత్రపు ఫీజుతో పంపుతాము. మీరు కావాలనుకుంటే పొందవచ్చు. తప్పకుండా తీసుకోవాలన్న ఎలాంటి నిబంధన లేదు.

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న ఇంగ్లీష్ కోర్సు

నెల్లూరులో ఒక్కరోజులో స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పించి రికార్డ్ సృష్టించిన ప్రోగ్రామ్‌లో కె.వి.ఆర్. ఇంగ్లీష్ హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి, ఒంగోలు, కడప, ఏలూరు, చిత్తూరు, నల్గొండ, కర్నూలు తదితర పట్టణాల్లో కూడా నిర్వహించి రికార్డ్ సృష్టించారు.

ప్రక్కనున్న కూపన్ పంపండి లేదా ఇంకా ఈజీ:



CHENNAI:
044-55519114.
0-9383302010.
0-9282107404.

పై ఫోన్ నెంబరుకు ఫోన్ చేసినా తెలుగులోనే మాట్లాడతారు. యస్.టి.డి. చార్జీలు ఇప్పుడు నామమాత్రమే కనుక దిగువ ఫోన్ చేసి కూడా మీ పూర్తి పేరు, ఇంటి నెం. వీధి పేరు, పిన్‌కోడ్‌లతో వివరంగా మీ అడ్రసు తెలియజేసి కోర్సు పొందవచ్చును. పై నెంబర్లలో ఏ ఫోన్‌కు అయినా మీ అడ్రస్ చెప్పండి. కోర్స్ వి.పి.పి.లో పొందండి. ఇంకా ఆలస్యం ఎందుకు.... వెంటనే రింగ్ చేయండి.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

3249

SINCE 1990

KVR INSTITUTE

AWARD WINNER

ఉచితం! రూ.100/-ల విలువచేసే 'మెమరీ ఇంప్రూవ్‌మెంట్ కోర్సు' (సింపుల్ ఇంగ్లీష్‌లో)

No.76 (S), Habibullah Road, T.Nagar, Chennai - 17.

నాకు ఒక నెల కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్, అడిషనల్ బుక్స్, కోర్సుకు ఉపయోగపడే పేపర్ బాక్స్, 25 గిఫ్ట్ పుస్తకాలు, 'అద్భుతమైన ఇంగ్లీషు - సులభమైన చిట్కాలు' పాకెట్ సైజు పుస్తకం మరియు ఉచితంగా రూ.100/- ల విలువచేసే 'మెమరీ ఇంప్రూవ్‌మెంట్ కోర్సు' (సింపుల్ ఇంగ్లీష్‌లో) అన్నీ మొత్తం కలిపి వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు మొత్తం రూ.441/-లు ధరం చెల్లించి పార్సెల్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

....

..................Pin Code: [ ][ ][ ][ ][ ][ ]

* SERVICE TAX INCLUDED

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు:

● **HYDERABAD: Dilsukhnagar.** Setwin Building, Opp: Venkatadri Theatre, Ph: 24141919, Cell:9848544519. **Ameerpet.** Dhanunjaya Chambers, Near: Saradhi Studio, Yousufguda Main Road, Ph: 30913546. **Uppal.** Above Bajaj Show Room, Jetta Mallaiah Complex, Ph: 27202461. ● **SECUNDERABAD:** # 110, College of Technology & Engineering Building, Opp: Hotel Abhiruchi, Paradise Circle, S.D.Road, Ph:55310532, Cell:98492 35031. ● **NELLORE:** D.No.17/704, Chakali Veedhi, V.R.College Centre, Ph:2342347. ● **CHITTOOR:** II Floor, M.B.R.Complex, D.I.Road, Ph: 229821. Cell: 9440078539. ● **NALGONDA:** Opp: Kanakadurga Temple, RAMAGIRI. Cell: 9440828540. ● **HANMAKONDA:** 2nd Floor, Beside: C.P. Reddy Complex, Main Road, Chowrasta. Ph: 2571905, Cell: 9849499920. ● **ANANTAPUR:** Opp: Srinivasa Tutorial, Near: Raviteja Hotel Lane, Kamala Nagar. Cell: 9440200216. ● **VIZIANAGARAM:** 2nd Floor, Fathima Plaza, Near: R.T.C. Complex, Ph: 551210.

పై కేంద్రాలలో ప్రత్యక్ష శిక్షణలో చేరే విద్యార్థులు ఫీజు చెల్లించిన వెంటనే స్పోకెన్ ఇంగ్లీష్ డైరెక్ట్ కోచింగ్ మెటీరియల్ 7 పుస్తకాలు + KVR ఫోల్డర్ ఫైల్ ఉచితంగా అడిగి తీసుకోండి.







కనదగు ఎవరు గీచినా...!





(తెలుగు కార్టూన్. కామ్ సౌజన్యంతో)

(శేఖర్‌కార్టూన్స్ "పారా హుషార్" నుంచి)

తేనీరు వారోత్సవాలు



టీ, కాఫీ డికాక్షన్ తెర్లాటలతో తెల్లారని ఇల్లేలేదు. ఆ పొగలు మోసుకువచ్చే సువాసనలతో పళ్ళుతోమో, తోమకుండానో బెడ్‌కాఫీ పేరున పాచినోట టీ తాగే కుటుంబాలు కూడా లేకపోలేదనుకోండి. చైనాలో టీ దాసులకూ సంబరాలట. ఝె జియంగ్ ప్రావెన్సీలో హాంగ్ ఝౌ లో ఈ టీ పండుగవారం ఘనంగా జరుగుతోంది. చైనా సినీ నటీమణుల నాట్య విన్యాసాలతో, తేనీరు ఘుమఘుమలతో ఆ వారమంతా అద్దిరిపోద్ది మరి!!

కుటుంబ నియంత్రణ మనుష్యులకేనా...?!



మానవజాతికే ముత్తాతజీవులు కోతులు ఎలియాస్ వానరాలు ఉరఫ్ మర్కటాలు. మరందుకే జీవపరిణామంలో మనకూ కోతులకు దగ్గర చుట్టరికం ఉందంటారు. "ఇంత వయస్సొచ్చినా కోతి బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు" అని ఒక్కోసారీ మనుషులు తోటి మనుషులతోనే తిట్టించుకుంటుంటారు కూడా. ఇటీవల మనుష్యుల బుద్ధి అవి కూడా పోనిచ్చుకోవడం లేదు. వానరాలు కూడా ఎడతెరిపి లేకుండా సంతానాన్ని కనేస్తున్నాయి. చెట్లూ పుట్టలూ ఖాళీ లేకుండా అయిపోతుందేమోన్నంతగా వాటి జనాభా పెరుగుతోందిట! కోతికి కొబ్బరికాయ దొరికినట్లు అని సామెతను నిజం చేయబోయాయంటే ఒక్క పిందె కూడా దొరక్కుండా అయిపోతుందేమోన్నంతగా సంఖ్య పెరిగిపోతోందిట! అందుచేత తిరుపతి ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌వారు ఎనిమిదిన్నర కోట్లరూపాయల ఖర్చుతో కోతెమ్మలకూ, కోతిగాళ్లకూ కుటుంబ నియంత్రణా ఆపరేషన్‌లు చేస్తున్నారు. సదరు కోతిజనులకు ఆదిలాబాద్, పశ్చిమగోదావరి జిల్లాలలో స్టెరిలైజేషన్ సర్జరీ(ఆపరేషన్) కేంద్రాలను తెరిచామని ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎస్ కె దాస్ సెలవిచ్చారు. కిచకిచ కీచ్‌కీచ్ కీ...చ్ కీ.....చ్ కీఈఈఈఈ....

"ఓడలు బళ్ళూ... బళ్ళు ఓడలూ"



కుటుంబం చితికిపోయిందనడానికి ఈ సామెతను చెబుతారని మీకు వేరే చెప్పక్కర్లేదు. రాత్రి 10గంటలకు మొదలెడితే తెల్లారడం చూసి ముగింపుకొస్తారే ... "సత్యహరిశ్చంద్ర" నాటకంలో "రాజే కింకరుడగు...కింకరుడే రాజగున్ కాలానుకూలంబునా...ఆఆఆ..." అనే పద్యం తీరుగా లేదు ఈ ఫొటో చూస్తే...?! నీటిలో ఉన్నంత వరకూ ఎన్నెన్ని హొయలుపోయిందో గానీ ఇటీవలి సునామీ దెబ్బకు ఒడ్డునొచ్చి వికలాంగురాలై మట్టినోట కరిచి స్తబ్దుగా పడిపోయింది. దానిని అదుగో అలా ఓడను బండెక్కించి దాని ఒళ్ళు బాగుచేయించి, బండెక్కించుకొచ్చారు. మళ్ళీ నీటి పై తేలియాడుతూ "హైలో...హైలెస్సా...హంస నడక ఆ పడవ" అంటూ సాగుతుంది.



మన సమాజం ఇంత ఎదిగాక కుటుంబం లేని సమాజాన్ని ఇక ఊహించడమే కుదరదు. ప్రపంచమంతటా మానవసమూహాలున్న ప్రతీచోట ఏదో రూపం కలిగిన కుటుంబం అనేది తప్పనిసరిగా ఉంది. ఎన్నో మార్పులు, మరెన్నో పరిణామాల తరువాత ఈ కుటుంబ వ్యవస్థ ఏర్పడింది. ఆ కుటుంబ వ్యవస్థ గురించి, తమతమ రీతుల్లో చర్చించుకుంటారని, ప్రతి మే 15వ తేదీని ప్రపంచ కుటుంబ దినోత్సవాన్ని పాటించాలని ఐక్యరాజ్య సమితి పిలుపునిచ్చింది. ఈ సంవత్సరపు కుటుంబ దినోత్సవాన్ని "కుటుంబ బాగోగులపై ఎయిడ్స్/ హెచ్ఐవి ప్రభావం" అనే అంశంతో జరుపుతోంది.

ప్రపంచ కుటుంబ దినోత్సవం

డా॥ ఎం.వి. లక్ష్మీదేవి

"మనసున మనసై...బ్రతుకున బ్రతుకై తోడొకరుండిన...అదే భాగ్యమూ...అదే స్వర్గము" అని ఒక సినీకవి రాగయుక్తంగా అన్నారు. అట్లాంటి స్వర్గాన్ని, భాగ్యాన్ని మనకందించే వ్యవస్థ కుటుంబం. ప్రపంచంలోని అన్ని సమాజాలలో

కుటుంబం కనబడుతుంది. కుటుంబాన్ని "విశ్వజనీనమైన, మౌలిక సామాజిక వ్యవస్థ" అని సమాజ శాస్త్రవేత్తలు వర్ణిస్తారు.

కుటుంబం అంటే ఏవిటీ?

...అని మనలను ఎవరైనా అడిగితే వెంటనే, "నేను, నా భార్య లేదా భర్త, నా కూతుళ్ళు, కొడుకులు" అని జవాబు చెప్తాం కదూ! "కుటుంబం అంటే సమాజం అంగీకరించిన విధంగా లైంగిక సంబంధాన్ని ఏర్పరుచుకున్న స్త్రీ-పురుషులు, వారి సంతతి" అని అనవచ్చు.

సాధారణంగా ప్రతి వ్యక్తి రెండురకాల కుటుంబాలలో సభ్యుడుగా ఉంటాడని సమాజ శాస్త్రవేత్తలు భావిస్తారు. తాను, తన తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు. ఇదంతా ఒక కుటుంబం. దీనిని అనుస్థాపిత కుటుంబం అంటారు. తాను, తన భర్త లేదా భార్య, తన సంతానం- ఈ కుటుంబాన్ని జన్మప్రాప్త కుటుంబం అంటారు. వ్యక్తి, అతని తల్లిదండ్రులు, పెళ్ళికాని అక్కచెల్లిళ్ళు, అన్నదమ్ములు, పెళ్ళయిన అన్న దమ్ములు, భార్య, పెళ్ళయిన కుమారులు, కోడళ్ళు, మనుమలు, పెళ్ళికాని కూతుళ్ళు... ఇదీ మన సమాజంలో కనిపించే ఉమ్మడి కుటుంబ నిర్మితి.

అయితే ప్రపంచంలో ఉమ్మడి కుటుంబాల కన్నా వ్యష్టి కుటుంబాలే ఎక్కువ.

రామాయణ, మహాభారత గాథల్లో చిత్రితమైన కుటుంబం

మన భారతీయ సాహిత్యంలో కూడా ఈ కుటుంబం గురించి నమోదు అయివుంది. అవి ఎంత కల్పితాలుగా ఉన్నా, కథలు అయినా, వాటిలో కొన్ని రకాలైన కుటుంబ నిర్మాణం చిత్రితమైంది. రామాయణ, మహాభారత పురాణసాహిత్యంలోనే పలువిధాలైన కుటుంబ వ్యవస్థలు కనబడతాయి. దశరథుడు బహుభార్యత్వం పాటించి, ముగ్గురు భార్యలతో వారి సంతానంతో ఉమ్మడి కుటుంబాన్ని ఆచరించాడు. ఆయన కుమారుడైన శ్రీరాముడు ఏకపత్నీ వ్రతం పాటించి, దాంపత్య కుటుంబ వ్యవస్థను పాటించాడు. ఈ కథలోని వానరులు గిరిజన కుటుంబ పద్దతిని

ఈ సంచిక ప్రత్యేక ఫొటో

చైనా కుటుంబం

మోనోగమీని పాటించిన సీతారాములు

పాటించారు. కౌసల్య, సుమిత్ర, కైకేయి-దశరథలు బహుభార్యత్వం(పోలోగమీ)ని, సీత-రాములు ఒక స్త్రీకి ఒక పురుషుడు అనే మోనోగమీని పాటించారు. అదే మహాభారత కథలో ధర్మరాజు, భీమ, అర్జున, నకుల, సహదేవులు-ద్రౌపది వివాహంతో బహుభర్తృత్వం పాటించిన కుటుంబ వ్యవస్థను చూస్తాం. ఇప్పుడు మనం అమెరికాలో కనబడే కొన్ని కుటుంబ సంబంధాలలో 'జెనిటికల్ ఫాదర్ లేదా మదర్', బయోలాజికల్ ఫాదర్ లేదా మదర్' అని వింటున్నాం. అంటే పుట్టుకకు కారకులు, పెంచుతున్నవారు వేరు వేరు అయినా అదొక కుటుంబంగా ఉంటున్నారు. ఇలాంటి కుటుంబ సంబంధాలు మహాభారతంలో, వేదాలలో కూడా ప్రస్తావనలున్నాయి. తన భార్యకు వేరేవారి వల్ల కలిగిన సంతానాన్ని 'క్షేత్రజులు' అన్నారు. పాండురాజు అశక్తుడవ్వడం వల్ల వేరే వారి వరప్రసాదంగా పుట్టిన పాండవులకు పాండురాజు క్షేత్రజుడు(బయోలాజికల్ ఫాదర్), తమ వల్ల వేరే అతని కుటుంబానికి సంతానం కలిగితే వారికి ఇతడు 'అంగజుడు'(జెనిటికల్ ఫాదర్) అన్నారు. ఇటువంటి కుటుంబసంబంధాలను దాటి సమాజం నేటి ఏకదంపతీ కుటుంబ వ్యవస్థ ఏర్పడింది. ఒక్కొక్క సమాజం తన తరాలకు ఇది మంచిది, ఇది అనుసరణీయం అని నేర్పడానికి సాహిత్యాన్ని ఒక సాధనంగా ఉపయోగించింది. అలా రామాయణ భారతాది సాహిత్యాల ద్వారా ఇన్ని రకాల దాంపత్యాలనూ, కుటుంబ వ్యవస్థలనూ చూపించి, వాటి మంచి చెడ్డలను బోధించారు. సీతారాములు లాగా ఏకదంపతీ కుటుంబ వ్యవస్థను ఆచరించాలని, పితృవాక్య పరిపాలన, సత్యమే

కుటుంబంఎట్లా ఆవిర్భవించింది?

వలకాలనే ఇత్యాది విలువలను బోధించడానికి రామాయణ కావ్యం రచించారు అనవచ్చు.

కుటుంబం పుట్టుక ఎలా, ఎప్పుడు జరిగిందో ఎవరికీ తెలియదనవచ్చు. అయితే కుటుంబం కొన్ని దశలుగా పరిణామం చెందిందనీ, ప్రస్తుతం మనం సభ్యులుగా ఉన్న వ్యష్టి కుటుంబం ఈ దశలలో చివరిదనీ లెవీ హెన్రీ మోర్గాన్ అనే మానవ శాస్త్రవేత్త వివరించాడు. మార్క్సియన్ సిద్ధాంత వాదులు కుటుంబాన్ని గురించి ఇంకా స్పష్టంగా ప్రస్తావించారు. ఫ్రెడరిక్ ఎంగెల్స్ తన "కుటుంబము-స్వంత ఆస్తి-రాజ్యముల ఆవిర్భావం" అనే గ్రంథంలో కుటుంబ పరిణామాన్ని చాలా చక్కగా వర్ణించారు.

బహుభర్తృత్వ కుటుంబాన్ని పాటించిన పాండవులు

తొలిమానవులు ఆహార సంగ్రహణ, వేటపై ఆధారపడి జీవించేవారు. ఈ "ఆదిమ కమ్యూనిజం" దశలో స్త్రీ-పురుషులు తమకు నచ్చినవారితో జత కట్టవచ్చు. దీనినే స్వైరితం అనేవారు. ఈ దశలో కుటుంబం అనే వ్యవస్థ ఏర్పడలేదు. క్రమంగా తల్లీ పిల్లల సంబంధం స్థిరపడింది. దీనితో మాతృ వంశానుక్రమ కుటుంబాలు ఏర్పడినాయి. దీనినే మాతృస్వామ్య వ్యవస్థ అనికూడా అన్నారు. (చంద్రగుప్త మౌర్యుడు తన తల్లి మురపేరున గుర్తించబడ్డాడు) ఈ కుటుంబాలలో తండ్రి ప్రాముఖ్యత లేదనే చెప్పవచ్చు.

వ్యక్తిగత ఆస్థిలోంచి...

ప్రైవేటు ఆస్తి అనేది వచ్చే నరికి, సమాజం లోని ఉత్పత్తి సంబంధాలలో కూడా మార్పు వచ్చింది. ఈ వ్యక్తిగత ఆస్థి అనే ఆర్థిక విధానం కుటుంబం పుట్టుకకు భూమిక అయ్యింది. తను సంపాదించిన ఆస్తి తన రక్తం పంచుకు పుట్టిన సంతానానికే చెందాలనే భావన కుటుంబం అనే పద్ధతికి దారివేసింది. ఇక్కడ నుంచి స్త్రీలను ఆస్థిలో భాగంగా పరిగణించసాగారు. ఈ దశలోనే తండ్రి అధికారిగా పితృ వంశానుక్రమ కుటుంబాలు ఏర్పడినాయి. దీనినే "పితృస్వామ్య వ్యవస్థ" అని కూడా అన్నారు. "రాజ్యం" అనే భావనకు కుటుంబమే పునాది అవ్వడం ప్రారంభమయ్యింది. ఉత్పత్తి కారకాలపై ప్రైవేటు యాజమాన్యం అనే పరిస్థితులు ప్రస్తుతకాలపు ఏకవివాహంపై ఆధారపడిన వ్యష్టి కుటుంబాన్ని ఏర్పరిచాయి.

ఇలాంటి వాటన్నింటి నుంచి మనకు ఒక విషయం స్పష్టమౌతోంది. కుటుంబం అనేది ఏర్పడ్డాక స్త్రీ-పురుషుల మధ్య శారీరక లైంగిక సంబంధంలో చాలా నియమనిబంధనలు చోటుచేసుకున్నాయి. ఈ సంబంధాలు అయా సమాజాలు అంగీకరించిన వాటిని సక్రమ సంబంధాలుగా, కుటుంబంగా ఏర్పడుతున్నాయి. అంగీకరించనివి అక్రమ సంబంధాలుగా, వివాహేతర సంబంధాలుగా చెప్పుకుంటారు. ఎక్కడైతే అంగీకారం ఉండదో అక్కడ అవి రహస్యసంబంధాలుగా చెలామణిలో ఉన్నాయి. అమెరికా, ఇంగ్లండ్, బ్రిటన్‌లాంటి దేశాలలో రకరకాల లైంగిక సంబంధాలు బాహాటంగా పాటించడమే కాక వాటిని సిద్ధాంతీకరించే ప్రయత్నాలు కూడా చేశారు. మానవసమాజం ఉన్న ప్రతీచోట మానవీయ విలువలతో కూడిన వివాహ, కుటుంబ వ్యవస్థలున్నాయి. అలా అమెరికాలాంటి దేశాలలో మంచి కుటుంబాలు ఉన్నప్పటికీ అక్కడ పెచ్చుమీరిన అరాచక ధోరణులలోంచి అనేక లైంగిక సంబంధాలు ఏర్పడ్డాయి. అక్కడ వివాహవ్యవస్థ బలహీనమై విడాకుల సంఖ్య పెరిగింది. విడిపోవడాలు, వేరొకరితో కలిసిఉండటాలు, పిల్లలు మాత్రం తల్లితో పాటు వేరొక తండ్రి సంరక్షణలో కొనసాగడాలు జరుగుతున్నాయి. దానితో అక్కడి కుటుంబాలలో జైవిక తల్లి లేదా తండ్రి కుటుంబాలు, సంరక్షక తల్లి లేదా తండ్రి కుటుంబాలున్నాయి. తండ్రులులేని పిల్లల సంఖ్య పెరుగుదల ఒక తీవ్రమైన సమస్యగా కూడా ముందుకొచ్చినట్లు మనం వింటున్నాం. ఈ పాశ్చాత్యదేశాలలో విపరీత లైంగికధోరణులు కూడా పాటించి స్వజాతిలింగ సంపర్కం (హోమోసెక్సువల్, లెస్బియన్‌లు)తో కూడిన కుటుంబాలు కూడా అనేకం ఏర్పడ్డాయి. వారు తమ చట్టబద్ధ హక్కులకై అనేక హక్కుల సంఘాలు, ఉద్యమ సంస్థలు పెట్టుకున్నారు.

సరిగ్గా ఇక్కడే ఆలోచించమని ఈ ఏడాది ప్రపంచ కుటుంబ దినోత్సవానికి పాటించేందుకు ఇచ్చిన అంశం చెబుతోంది. లైంగిక సంబంధాలలోని అపసవ్యత, ప్రకృతి విరుద్ధ చర్యల వల్ల హెచ్‌ఐవి/ఎయిడ్స్

ఈ సంచిక ప్రత్యేక ఫొటో

ఆఫ్రికా కుటుంబం



కుటుంబం గురించి ఎవరెవరు ఏమన్నారంటే...!

"వివాహం, తల్లిదండ్రుల విధులూ-బాధ్యతలూ, తల్లి తండ్రులూ వారి సంతానం కలసి నివసించడం, తల్లిదండ్రులూ వారి సంతానం మధ్య పరస్పర సంబంధాలూ కలిగి ఉండే సమూహమే కుటుంబం"

రాల్ఫ్ లింటన్

"ఒకేచోట నివసించడం, ఆర్థిక సహకారం, ప్రత్యుత్పత్తి అనే లక్షణాల్ని కలిగి ఉండే సమూహమే కుటుంబం"

-జార్జి పీటర్ మర్డక్

"కుటుంబం అనేది నిత్యం మారుతూ వుంటుంది. అదెప్పుడూ స్థిరంగా ఉండదు. సమాజం దిగువస్థాయి నుండి ఉచ్ఛస్థాయికి పురోగమిస్తున్నకొలదీ కుటుంబం కూడా దిగువస్థితి నుండి ఉన్నత స్థితికి అభివృద్ధి చెందుతుంది...కానీ రక్త సంబంధాల వ్యవస్థ అలాకాదు. అది కదలదు. చాలాకాలానికో మారు కుటుంబంలో వచ్చిన ప్రధానమైన మార్పుల్ని నమోదు చేస్తూ ఉంటుంది. కుటుంబ వ్యవస్థ సమూలంగా మారినప్పుడు మాత్రమే అది కూడా మారుతుంది."

-లూయీ మోర్గాన్

"ఏంగెల్స్ రచించిన "కుటుంబము, స్వంత ఆస్థి, రాజ్యముల ఆవిర్భావం" అనే గ్రంథాన్ని మీరు చదువుతారని నేను ఆశిస్తున్నాను. ఆధునిక సోషలిజం మనకు ప్రసాదించిన మౌలికమైన గ్రంథాలలో ఇది ఒకటి"

-వి ఐ లెనిన్

లాంటి వైపరీత్యాలు వస్తున్నాయి. ముఖ్యంగా పాశ్చాత్యదేశాలలో అవలంభిస్తున్న హోమోసెక్స్ వల్ల ఈ ఎయిడ్స్ వ్యాధి వచ్చిందనే బలమైన వాదన ఉంది. ఈ ఎయిడ్స్ ఏకదంపతీ కుటుంబ విలువలనొదిలిపెట్టి అసహజ లైంగిక చర్యలు చేపట్టడం వల్లే కదా! అక్రమసంబంధాలు, వ్యభిచారం వల్ల ఈ వ్యాధి మరింతగా వ్యాపించి కుటుంబాలు నాశనమై, సమాజం అంతరించిపోయే ప్రమాదం కలుగుతుంది. అందుకే ఉన్నత కుటుంబ విలువలు పాటించడమే ఎయిడ్స్ మహమ్మారికి నిజమైన సమాధానం అవుతుంది.

కుటుంబం మనకెంతో అవసరం

వ్యక్తి, కుటుంబం, సమాజం- వీటిని ఒకదాని నుంచి మరొకదానిని విడదీయలేము. మనం చేసే ఆలోచన, ప్రతిపని కుటుంబం అన్ని రంగాలలోనూ ప్రాముఖ్యత వహించేది. ఈనాడు కుటుంబానికి పూర్వం ఉన్న బాధ్యతలు లేకపోయినప్పటికీ పిల్లలను కని, పెంచి, భావిపౌరులుగా తీర్చిదిద్దడం కుటుంబ బాధ్యతే.

కుటుంబ విధులలో ఆర్థిక విధి కూడా ప్రధానమైనదే. మనమంతా మన పిల్లల శ్రేయస్సు కోసం ధనాన్ని ఆర్జిస్తాం. దీని ఫలితంగా సమాజం, కుటుంబం- రెండూ ఆర్థికంగా బలపడతాయి. కుటుంబం వ్యక్తికి అంతస్తును, హోదాను కల్గిస్తుంది.

గతంలో తల్లిదండ్రులే తమ పిల్లలకు విద్యనేర్పేవారు. మత సంబంధమైన ఉత్సవాలు, ఆరాధనలు, వినోద కార్యకలాపాలు ఇవన్నీ కటుంబమే నిర్వర్తించేది. పారిశ్రామికీకరణ, నగరీకరణ పెరిగినకొద్దీ కుటుంబం చేసే పనులలో ఎన్నో మార్పులు వచ్చాయి. వస్తున్నాయి. కుటుంబం నిర్వహించే విద్య, మత, వినోద, ఆరోగ్య సంరక్షణ బాధ్యతలు ఈనాడు విద్యాసంస్థలు, మతం, సినిమాలు, క్రీడాసంఘాలు, ఆస్పత్రుల వంటి సంస్థలు స్వీకరించాయి.

నేడు కుటుంబ స్వరూప స్వభావాలు వేగంగా మారుతున్నాయి. ఉమ్మడి, పెద్ద కుటుంబాలు పట్టణాల్లో దాదావు మాయం అవుతున్నాయి. చిన్న కుటుంబాలు(మైక్రో ఫామిలీ) పెరుగుతున్నాయి. ప్రైవేటు ఆస్థి విధానంలో దాగి ఉన్న డబ్బు సంబంధాల "రాక్షసిబల్లి(డైనోసార్)" సమిష్టి భావనను మింగేస్తోంది. కుటుంబాలనూ, కుటుంబసంబంధాలనూ విచ్ఛిన్నం చేస్తోంది. ఆస్థి తగవులు, వారసత్వ హక్కులు కుటుంబాల్ని బద్దలుకొట్టి వేరు కుంపట్లు పెట్టిస్తోంది. వేరుపడ్డ చిన్ని కుటుంబాల్లోనూ ఈ డబ్బు సంస్కృతి 'వస్తువినిమయ సంస్కృతి'గా రూపెత్తి విలువల్ని నాశనం చేస్తోంది. ఎలాగైనా డబ్బు సంపాదించాలనే యావ నిరంతరం వెంబడిస్తుంది. ఆ యావలో తమ చిన్ని కుటుంబంలోని పిల్లల్ని సరిగ్గా చూడక ఒంటరి పెరుగుదలకు గురిచేస్తున్నారు. నేటి చిన్నిచిన్ని కుటుంబాల పిల్లల బాల్యాలకు అమ్మమ్మ, నాయనమ్మల, తాతయ్యల తోడు లేదు. "అనగనగా ఒక రాజు" కథల అద్భుతప్రపంచం లేదు. ఒక తరాన్నుంచి మరో తరానికి నేర్పే మామ్మ-తాతల "ఒడిబడి" లేదు. వీటన్నంటి స్థానంలో క్రెచ్‌ల, ఆయాల అద్దె అమ్మతనాలు వచ్చాయి. టామ్ అండ్ జెర్రీ, కామిక్ కార్టూన్ టీవీ తెరల నిర్జీవ ఎలక్ట్రానిక్ లాలింపుల బాల్యం వచ్చింది. ఇలాంటి పెంపకంలో రాబోయే తరాలు ఎలాంటి మానసికతలతో, ఎలాంటి సామాజికత రూపొందుతుందో మానసిక, సామాజిక నిపుణులు చెప్పాల్సిందే.

కుటుంబ బాధ్యతలు, కుటుంబ సైజు తగ్గినంతమాత్రాన కుటుంబం ప్రాముఖ్యత తగ్గదు. వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేది కుటుంబమే కదా! కుటుంబం సమాజ నిర్మాణానికి, భవిష్యత్తుకు మూలం. దేశ ఉన్నతికి ఆయువుపట్టు.



ప్రపంచ కుటుంబ దినోత్సవం ప్రధాన కార్యదర్శి సందేశం

ఈ సంవత్సరం అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం "కుటుంబ బాగోగులపై హెచ్ఐవి/ఎయిడ్స్ ప్రభావం" అనే అంశంపై జరుగుతుంది. అది ఈనాటి తీవ్రమైన సమస్యాత్మకమైన విషయం. ప్రపంచవ్యాపితంగా ప్రభుత్వాలకూ, జాతులకు, కుటుంబాలకు ఒక హెచ్చరికగా తయారైంది.

కుటుంబాలపై హెచ్ఐవి/ఎయిడ్స్ మరణమృదంగాన్ని మోగిస్తోంది. కుటుంబంలోని ఒక వ్యక్తి గనుక రోగగ్రస్తుడై మరణిస్తే, ఆ కుటుంబమంతా చెప్పరాని దుస్థితికి గురౌతోంది. ఆర్థిక ఇబ్బందులు ఎంతటి విషాదానికి గురిచేస్తోందో చెప్పలేం. రోగగ్రస్తుడికి ఆరోగ్య వృద్ధికై ఎంత ఖర్చుపెట్టాల్సి వస్తుందంటే ఆ మేరకు కుటుంబమంతా తమ కూడు, గుడ్డ, గూడుల కోసం వెచ్చించే డబ్బుని ఇటు ఖర్చు పెట్టాల్సివస్తోంది. కుటుంబంపై ఈ హెచ్ఐవి/ఎయిడ్స్‌ల ప్రభావం ముఖ్యంగా పిల్లల భవితవ్యాన్ని నాశనం చేస్తోంది. ఆ కుటుంబాలలోని యుక్తవయస్సు ఆడపిల్లలను, చిన్నపిల్లలను వీధిపాలు చేస్తోంది.

ఎయిడ్స్‌వ్యాధిని నివారించుటలో, జాగ్రత్తలు వహించుటలో కుటుంబం పాత్ర చాలా ముఖ్యమైందని 2001వ సంవత్సరంలో జరిగిన యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం గుర్తించింది. ఈ ఎయిడ్స్‌కి వ్యతిరేకంగా తగు ప్రత్యేకమైన, శక్తివంతమైన చర్యల్ని చేపట్టాలని అన్ని దేశాల ప్రభుత్వాల్ని కోరుతున్నాం.

చివరగా, ఈ హెచ్ఐవి/ఎయిడ్స్‌కి సరైన సమాధానం శక్తివంతమైన, సమైక్య కుటుంబ వ్యవస్థ మాత్రమే. ఈ అమూల్యమైన యూనిట్ అయిన కుటుంబాన్ని చిరస్థాయిగా నిలబెట్టడానికి పునరంకితమవుదాం.

ప్రధాన కార్యదర్శి

"విడిపోయి... కలిసుందాం"

చెమికల రాజశేఖరరెడ్డి

"నాన్నా నేను వేరేగా ఉందామను కుంటున్నాను..." అని పెద్ద కొడుకు నరేంద్ర అనేసరికి రాఘవయ్యకు కాసేపు ఏమనలో తెలియలేదు.

పెద్దోడు పొద్దున చెప్పిన ఆ సంగతి రాఘవయ్యను ఓ చోట స్థిమితంగా కూర్చోనీయడం లేదు. పిడుగులాంటి ఆ విషయం వినగానే ఆయనకు ఊపిరి ఆగిపోయినంత పనయింది.

కక్కలేక మింగలేక... చెప్పాలా వద్దా అన్నట్టుగా... అప్పటికప్పుడు వివరంగా మాట్లాడలేక... "సరే చూద్దాం" అని మాత్రమే అన్నారాయన.

కొద్ది సేపు తర్వాత ఆఫీసుకు వెళుతూ వెళుతూ చిన్నోడు ఈశ్వర్ కూడా అదే విషయం నసుగుతూ నసుగుతూనే ప్రస్తావించాడు.

హతాశుడయ్యాడు రాఘవయ్య. "నా చిన్నీగాడు... ఈశీగాడు కూడా అంతటోడయ్యాడా" అని కిందమీదులయ్యాడు...."అంటే ఇద్దరూ మాట్లాడుకునే ఈ నిర్ణయం తీసుకున్నారన్నమాట" అనుకున్నాడు.

రాఘవయ్య ఈ మధ్యనే టీచర్‌గా రిటైరయ్యారు. పిల్లలిద్దరినీ క్రమశిక్షణగా పెంచి వారికి ఉన్నత విద్యలు చెప్పించడమే కాకుండా వారిద్దరికీ మంచి ఉద్యోగాలు వచ్చేంతవరకు ఆయన, ఆయన భార్య విశాలాక్షి కష్టించి పనిచేశారు అని మాత్రమే అనడం చాలా తక్కువ చెప్పడమే అవుతుంది. వాళ్లిద్దరూ పిల్లలకు ఏ లోటూ కలగకుండా కుటుంబాన్ని అభివృద్ధిపథంలో నడిపించారు. కొడుకులిద్దరికీ మంచి సంబంధాలు తెచ్చి వివాహాలు చేశారు. పెద్దవాడికి కూతురు కలిగినపుడు, చిన్నవాడికి కొడుకు పుట్టినప్పుడు రాఘవయ్య దంపతులు పొందిన ఆనందాన్ని మాటల్లో చెప్పలేము.

రిటైరయినప్పటినుంచీ రాఘవయ్య ఇంటి దగ్గర ఉంటూ మనుమడితో, మనుమరాలితో హాయిగా ఆడుకుంటూ కాలక్షేపం చేస్తున్నాడు. ఇక అందరమూ హాయిగా ఉన్నాము, ఇంకెలాంటి సమస్యలు లేవనుకుంటున్న తరుణంలో ఉన్నట్టుండి ఈ పిడుగులాంటి వార్త. సొంత కాపురాలు పెట్టుకుంటామని

పిల్లలిద్దరూ అనడంతో ఆయన మనసులో మాటలకందని బాధ మొదలయింది. కోడళ్లిద్దరూ మంచివాళ్లే. ఎప్పుడూ వాళ్లవైపునుంచి ఎలాంటి ఎత్తిపొడుపు మాటలు తను వినలేదు. తన కొడుకులిద్దరి సంగతి కూడా తనకు తెలుసు. వారిలో ఉన్నతమైన మానవ విలువలు పెరగడానికి తానెంతగానో తపించిపోయాడు. మరి ఈ విడిపోవడం ఏమిటో ఆయనకు అర్థం కాలేదు. ఎప్పుడూ ఆయన ఆ వైపుగా ఆలోచించలేదు. ఇక ఈ విషయాన్ని కోడళ్ళతోనే మాట్లాడాలనుకున్నారాయన. కొడుకులిద్దరూ ఆఫీసుల నుంచి రాకముందే కోడళ్లతో ఈ విషయాన్ని చర్చించాల నుకుని తన బెడ్‌రూమ్‌లోకి వెళ్లి ఏం మాట్లాడాలో కాసేపు ఆలోచించాలనుకున్నారు.

దిండులో తల పెట్టుకుని సన్నగా ఏడుస్తూ కనిపించింది భార్య విశాలాక్షి. ఆయన వెంటనే తలుపు వేసి కాసేపు మౌనంగా కూర్చుండి పోయారు. "ఎందుకిలా జరుగుతోంది. రాత్రి నిద్రపోయేంతవరకూ అందరమూ ఎంతో హాయిగా నవ్వుతూ తుళ్లుతూ గడిపామే. తమ జీవితాలు ముగిసేంతవరకు ఇలాగే కొడుకులతో, కోడళ్ళతో, మనుమలు, మనుమరాళ్ళతో సంతోషంగా గడపవచ్చనుకుంటే ఇలా జరుగుతోందేమిటి' అని ఆయన మనసులో పదే పదే అనుకున్నారు. ఉన్నట్టుండి ఇలా విడిపోదామనే ఆలోచనను కొడుకులిద్దరూ చెప్పేసరికి ఏదో పెద్ద విస్ఫోటనం కళ్లముందు సంభవించినట్టయింది రాఘవయ్యకు.

ఐదేళ్ల క్రితం ఇంటిని కట్టించడం కూడా అందరమూ కలిసే ఉంటామనే ధోరణితోనే అందుకు అనుగుణంగా కట్టించారు. మూడు బెడ్‌రూములతో అందరూ హాయిగా తిరగడానికి వీలుగా వుండే హాలు, విశాలమైన కిచెన్‌తో సౌందర్యాత్మకంగా ఉండేలా ఆ ఇంటిని రూపొందించారాయన. బంధువులెవరొచ్చినా వారి వలన ఎవరికీ సమస్య రాకుండా వుండేలా ఒక గెస్ట్‌రూము కూడా కట్టించాడు.

నవ్వుల పరిమళాలు వెదజల్లుతూ హాయిగా ఆనందంగా సందడి సందడిగా ఉండే ఆ ఇల్లు మరో కొద్ది రోజుల్లో బోసి పోతుంది. ఈ గుండెల మీద ఆడి పాడి నానా అల్లరి చేసి పెరిగి పెద్దవారయిన పిల్లలు తమ పిల్లలతో దూరంగా వెళ్లిపోతారు. మరో ఇద్దరు పిల్లలు తమ గుండెల మీద కూర్చుని ఆడుకోడానికి రెడీగా వున్నారని రిటైరయ్యే రోజు ఆయన అనుకున్నారు కూడా. అలా అనుకుని మూడు నెలలు కాకముందే ఈ కుటుంబం, అందమైన ఈ గూడు విచ్ఛిన్నమవుతుం దనుకునేసరికి రాఘవయ్యకు, ఆయన భార్య విశాలాక్షికి నోటమాటరాలేదు. ఆధునిక యువతులైన కోడళ్ళ మనసులకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా సాధ్యమైనంతవరకూ జాగ్రత్తలు తీసుకున్నామనుకున్నారు



ఈ సంచిక ప్రత్యేక ఫోటో

ఆస్ట్రేలియన్ కుటుంబం

రాఘవయ్య దంపతులు. అయినా విడిపోవడమనే సమస్య ప్రస్తుతం వారి ముందు పెనుభూతంలా నిలిచింది.

"అమ్మా..." ఆ పిలుపు పెద్దోడిదే. ఆ పిలుపు వాడు ఆఫీసుకెళ్ళేముందు షర్టు గుండీలు ఇంకా పెట్టుకుంటూనే వచ్చి తల దువ్వించుకునేటప్పుడు [illegible]

యథాలాపంగానే దువ్వెన తీసుకుని వెళ్ళబోయింది. కానీ...

"నే వెళుతున్నా..." అనేయడం, గిరుక్కున వెళ్ళిపోవడం కూడా అయిపోయింది.

పక్కన భార్య ఉన్నా అమ్మతో తల దువ్వించుకునే పెద్దోడు ఇక ముందు తనకా పని చెప్పడనుకునేసరికి ఆ తల్లి గుండె ఆగిపోయినట్టయింది. తనకొక కొడుకు పుట్టినా సరే... తన కొడుకు తలనే కాదు, తన తలను కూడా తుడవమనే చిన్న కొడుకు గుర్తొచ్చి ఆమె కళ్ళల్లో చెరువులు ప్రత్యక్షమయ్యాయి.

ప్రేమానురాగాల సౌధం కూలిపోతుందనే ఆలోచన రాఘవయ్య దంపతుల మనసులను తీవ్రంగా కలచివేస్తోంది.

కొడుకులిద్దరివీ మంచి ఉద్యోగాలు. కుటుంబ ఆదాయం ఇప్పుడు మూడు రెట్లయింది. డబ్బుకు ఎక్కడా తడుముకోవాల్సిన అవసరం లేదు. తనకూ పెన్షన్ వస్తోంది. ఇల్లు కట్టుకోవడానికి తీసుకున్న బ్యాంకు లోన్ కూడా సంవత్సరం క్రితమే తీరింది.

కొడుకులు, ముఖ్యంగా కోడళ్ళు ప్రైవసీ కోరుకుంటున్నారేమో... తమ ఇష్టమొచ్చిన రీతిలో, తమ అభిరుచులకు అనుగుణంగా జీవించాలనుకుంటున్నారేమో... అందుకే విడిపోవాలనుకుంటున్నారేమో... ఈ విధంగా మనసులో అనుకొని ఆ దిశగా ఆలోచించారు రాఘవయ్య.

ఆలోచించగా ఆలోచించగా అదే నిజమేననిపించిందాయనకు. ఇంట్లో అందరూ చూడడానికి ఒకే టీవీ ఉంది. ఎవరి ఆలోచనలు వారివి. వారు కోరుకున్న ఛానెల్‌ను చూడలేకపోవడంవలన ఇలాంటి ఆలోచన వచ్చి ఉండవచ్చు. భార్య ఆధ్యాత్మిక విషయాలను ప్రసారం చేసే ఛానెళ్లను చూడాలనుకుంటుంది. కోడళ్ళు సీరియళ్ళు చూడాలనుకుంటారు. వారి పిల్లలు కార్టూన్ ఛానెళ్లంటే ఇష్టపడతారు. తనకేమో వార్తలను మోసుకొచ్చే ఛానెళ్ళను చూడాలనుంటుంది. ఇలాగే తిండి విషయంలోనూ ఎవరి అభిరుచులు వాళ్లకుంటాయి. పైకి సఖ్యంగా కనిపించినప్పటికీ కోడళ్ళిద్దరూ తమ అభిరుచుల్లో తేడాలవలన లోలోపల బాధపడిపోతున్నారేమో... విడిపోవాలనే ఆలోచనల్ని తమ మొగుళ్ళ దగ్గర వెలిబుచ్చి వారి మీద ఒత్తిడి తెస్తున్నారేమో...

ఇలా ఆలోచించేసరికి రాఘవయ్య మనసులోని సందేహాలు ఒకటొకటే విడిపోతున్నట్లనిపించింది. ఈ ఇంట్లో ఎవరి ఆలోచనలకు అనుగుణంగా వారు వారి పద్ధతిలో జీవించలేకపోతున్నారు కాబట్టే ఒకరిమీద మరొకరికి ప్రేమాభిమానాలున్నప్పటికీ కొడుకులిద్దరూ విడిపోవాలనే నిర్ణయం తీసుకొని వుండవచ్చు.

చిన్నప్పుడు కొడుకులిద్దరూ ఎంత సఖ్యంగా ఉండేవారో గుర్తుకొచ్చేసరికి రాఘవయ్య మనసు ఓ సారి బాధగా మూలిగింది. "రాఘవయ్య పిల్లల్ని చూసి నేర్చుకోండ"ని ఇతరులు అంటుంటే ఆయన ఎంతో గర్వపడేవారు. అన్నకు జ్వరం వస్తే తమ్ముడు కూడా జ్వరం వచ్చినంతగా కదిలిపోయేవాడు. దగ్గరుండి తమ్ముడికి తెలియని విషయాలన్నీ ఓపిగ్గా చెప్పేవాడు పెద్దవాడు. నిజానికి చిన్నోడికి అసలైన టీచర్ పెద్దోడే. ఇప్పటికీ బాగానే ఉంటారు. ఎప్పుడూ ఒకరిని మరొకరు గట్టిగా అరుచుకున్నట్టుగా తనకు గుర్తు లేదు. ఎలాంటి సమస్యనైనా సామరస్యంగా పరిష్కరించుకోవడమే తప్ప ఒకరు మరొకర్ని నిందించిన పాపాన పోలేదు. అన్నదమ్ముల అనుబంధానికి ప్రతీకగా నిలిచిన ఈ అన్నదమ్ములు వేరు కాపురాలు పెట్టాలనుకోవడం రాఘవయ్యకు మింగుడు పడలేదు.

జరగబోయే సంఘటనలను ఎదుర్కొనేలా మనసును తీర్చిదిద్దుకోవాలి. అంతే తప్ప చింతించి ప్రయోజనం లేదని భార్యతో చెబుదామని ఆమె భుజం పట్టుకొని ఇటువైపు తిప్పారు రాఘవయ్య. ఆమె కళ్లు వాచిపోయి ఎర్రగా ఉన్నాయి. నానమ్మా, నానమ్మా అంటూ తన చుట్టూ తిరిగే పిల్లలు ఇక ముందు తనకు కనిపించరేమోనని ఆమె తల్లడిల్లిపోతోంది.

ఆమె తన చేతిలోని చీటీని తీసి భర్త చేతిలో పెట్టింది. "పెద్దోడు నీకియ్యమన్నాడు" అని చెప్పి, ఆమె అటు తిరిగి పడుకుంది.

నాన్నా...

నీ ముందు నిలబడుకొని అన్ని విషయాలూ వివరించలేక ఈ చీటీ ఇస్తున్నాను. మన కుటుంబ అనుబంధాల గురించి ఆప్యాయతల గురించి నీకు నేను ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. మా అన్నదమ్ముల మధ్యగల సఖ్యత గురించి కూడా ప్రత్యేకంగా చెప్పలేను. నా తమ్ముడి విషయంలో నేను సర్దుకుపోతాను. నా విషయంలో నా తమ్ముడు సర్దుకుపోతాడు. ఇద్దరి మధ్యన వున్న అవగాహన అలాంటిది. అలాంటి అవగాహన ఏర్పడేలా చిన్నప్పట్నుంచి నీవు, అమ్మ తీసుకున్న జాగ్రత్తలు ఎంతో గొప్పవి. శరీరాలు వేరయినా మనసులు ఒకటే అన్నట్టుగా పెరిగాం. మా భార్యలు కూడా మంచివారే. కానీ వారికున్న భిన్నాభిప్రాయాలు, అభిరుచులు మమ్మల్ని విడిపోయేలా చేస్తున్నాయి. మీ కోడళ్ళిద్దరూ చెడ్డవాళ్ళని చెప్పడం మా ఉద్దేశ్యం కాదు. వారిని అర్థం చేసుకోవడానికి మేమిద్దరం ప్రయత్నం చేసి ఈ నిర్ణయం తీసుకున్నాం. భవిష్యత్తులో మా అన్నదమ్ముల అనుబంధం ఇలాగే కొనసాగాలంటే మేము విడిపోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇది వినడానికి మీకు విచిత్రంగా ఉండవచ్చు కానీ ఇది మా తరాలకు వాస్తవం. మీరు కట్టిన అందమైన గూడునుంచి మేము ఎగిరిపోతున్నామనేసరికి మీకు ఎంతో బాధ కలగవచ్చు. కానీ ఒక సంవత్సర కాలంగా మా అన్నదమ్ముల మధ్యన చర్చనీయాంశమవుతున్న ఈ సమస్యను ఇంకెంతమాత్రమూ మీకు చెప్పకుండా ఉండలేక ఈ రోజు ఇలా చెప్పాల్సి వచ్చింది. ఘర్షణ వాతావరణం ఏర్పడిన తర్వాత మనసుల్ని నొప్పించుకుంటూ మరింకెప్పుడూ కలుసుకోడానికి వీలు లేకుండా విడిపోవడం కంటే ఆరోగ్యకర వాతావరణం వుండగానే విడిపోవడం మంచిదని మా ఇద్దరికీ అనిపించింది. మా ఆలోచనలో తప్పుంటే క్షమించండి.

-మీ పెద్దోడు

రాఘవయ్య కళ్లలోంచి నీళ్ళు ఉబికి ఆ ఉత్తరంపై పడ్డాయి. ఆ ఉత్తరం చదివిన తర్వాత కోడళ్ళతో చర్చించి ప్రయోజనం లేదనే విషయం రాఘవయ్యకు అర్థమయింది. వాళ్లు చెప్పినట్టుగానే వినాలనుకొన్నారాయన. తన బెడ్‌రూములోంచి హాలులోకి వచ్చేసరికి కోడళ్ళిద్దరూ ఏవో కబుర్లు చెప్పుకుంటూ వంట పనుల్లో మునిగిపోయి ఉన్నారు. మామగారిని చూడగానే గట్టిగా మాట్లాడడం తగ్గించి మెల్లగా మాట్లాడసాగారు. తమ మాటల్ని భర్తలు విన్నందుకు, త్వరలో తాము స్వేచ్ఛగా ఎగిరిపోతున్నందుకేమో ఆ సంతోషం అని ఆయన మనసులో అనుకున్నారు. అంతే తప్ప ఆయన మనసులో వారిమీద ఎలాంటి ద్వేషం కలగలేదు. వరండాలో అక్క జడ పట్టుకొని ఆడుకుంటున్న మనుమడు కనిపించాడు. ఇక ముందు ముందు ఆ దృశ్యం ఉండదనుకునేసరికి ఆయన మనసు బాధగా అరిచింది.

పిల్లలిద్దరికీ ముద్దుల మీద ముద్దులు పెట్టి వాళ్లను నవ్వించి, ఇంట్లోనుంచి బయటకొచ్చి ఓ సారి తన కలలసౌధంవైపు ఓ సారి తేరిపార చూశాడు రాఘవయ్య. అది గంభీరంగా కనిపించింది. ఇదివరకు ఇంటివైపు చూడగానే మనసులో ఏదో ఆహ్లాదం ఆవరించేది. ఈసారి ఆయన మనసులో విషాదఛాయలు అలుముకున్నట్టుగా అనిపించింది. ఇంత పెద్ద ఇంటిలో ముందు ముందు తను తన భార్య ఇద్దరే ఉంటామా అనుకొనేసరికి ఆయన మనసులో వృద్ధాప్యం మరింతగా పెరిగింది.

పక్కన ఉన్న ఇల్లను ఓసారి పరికించి చూశారు. అన్నీ ఈ మధ్యనే కొత్తగా కట్టిన ఇళ్లు. తన ఇంటికి వెనకవైపున వున్న మంగారావు తన ఇంటిపైన మరో రెండు పోర్షన్లు కట్టిస్తున్నాడు. ఆ పోర్షన్లు ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నాయి. వాటిని అద్దెకివ్వాలనేది మంగారావు ఆలోచన. ఆ నిర్మాణం చూడగానే రాఘవయ్య మనసులో ఓ ఆలోచన తళుక్కున మెరిసింది. ఆ ఆలోచన రాగానే వెంటనే ఆయన మంగారావు దగ్గరికి వెళ్లి ఆ రెండు పోర్షన్ల నిర్మాణానికి ఎంత ఖర్చవుతుందని అడిగాడు. ఆయన ఆరులక్షలదాకా ఖర్చవుతోందని బదులిచ్చాడు. ఏదో పిచ్చాపాటీ మాట్లాడి సాయంత్రం ఎప్పుడవుతుందా అనుకుంటూ తిరిగి ఇంటికొచ్చాడు రాఘవయ్య.

కొడుకులిద్దరూ ఆఫీసులనుంచి రాగానే రాఘవయ్య వారిని తన బెడ్‌రూములోకి పిలిచి "మనం విడిపోదాము... కానీ కలిసే ఉందాం" అనేసరికి వాళ్లు కాస్త అయోమయంలో పడ్డట్టుగా మొహాలు పెట్టారు.

"మన ముగ్గురం కలిసి ఓ మూడులక్షల పెట్టుబడి పెడితే మరో మూడు లక్షల రూపాయలు బ్యాంకునుంచి వస్తాయి. దాంతో మన ఇంటిపైన రెండు చక్కటి పోర్షన్లు వేయొచ్చు. మీ పద్ధతిలో మీరు, మీ అభిరుచులకు తగ్గట్టుగా జీవించొచ్చు. మేమిద్దరం చనిపోయేంతవరకూ మీరు మీ పిల్లలు మా కళ్ల ముందు ఉన్నట్టుంటుంది. వీలయినప్పుడల్లా పిల్లలతో ముసలోళ్లమిద్దరమూ ఆడుకుంటాం. మూడు పొయ్యిల వలన ఖర్చు అధికం కావొచ్చు కానీ వైవిధ్యమైన రుచులను కూడా అందరమూ పంచుకోవచ్చు... ఏమంటారు? మీ భార్యలతో చెప్పి మీ నిర్ణయం పొద్దున్నే చెప్పండి" అని ఆయన తన మనసులోని ఆలోచనను గుక్క తిప్పుకోకుండా చెప్పారు.

మరో రెండు రోజుల్లో మంగారావు పోర్షన్లను కడుతున్న మేస్త్రీ చంద్రయ్య రాఘవయ్య ఇంటిపైన కూడా పని మొదలుపెట్టాడు.

★

గొప్ప కోసం

పుప్పాల కృష్ణమూర్తి

ఒక చెరువులో ఐదు ఎండ్రకాయలుండేవి. కుళిర, నీర, గాజ, భాష్ప, కుశలి వాటి పేర్లు. అవి సాయంత్రం చేరువు కట్టకు ఆనుకుని వున్న పెద్ద బండ కింద సమావేశమయ్యేవి. అప్పుడు అవి విన్నవి, కన్నవి, స్వంత అనుభవాలు చెప్పుకుంటుండేవి.

ఎప్పటిలానే ఆ రోజు కూడా అన్నీ ఒకచోట చేరాయి. అన్నిట్లోకి పెద్దదైన కుళిర ముందుగా లేచి నిలబడి 'గతంలో నేనున్న మడుగు ఎండిపోవచ్చింది. దాంట్లోంచి పెద్దమడుగులోకి వెళ్లాలని ఓనాడు బయలు దేరాను. మనకు భూమ్మీద, ఆకాశంలో అంతటా శత్రువులేనాయె...అందుకే నేను కేవలం రాత్రిళ్లు మాత్రమే ప్రయాణం ఛేస్తూ ఓ పెద్ద మడుగు చేరుకునేసరికి నెల రోజులు పట్టింది. అలాంటి ప్రయాణం మన పీతల్లో ఇంతవరకూ ఎవరూ చేయలేదని మాత్రం నిక్కచ్చిగా చెప్పగలను" అంది.

తర్వాత నీర అనే పీత లేచి 'ఈమధ్య నేనిదే చెరువులో ఆహారం వెదుక్కుంటూ తిరుగుతున్నాను. అప్పుడు హఠాత్తుగా ఓ కొంగ నన్ను చూసి రెండు కాళ్లతో పట్టుకుని పైకి ఎగిరింది. నేను నా బలమంతా ఉపయోగించి వదిలించుకున్నాను. సరాసరి అక్కడినుండి చెరువులో పడ్డాను. కొంగ ఉక్కు గోళ్ల నుండి తప్పించుకోవడం ఒక సాహసమైతే.. ఆకాశంలో నుండి కిందబడి బతకడం నిజంగా అదృష్టమే" అంది.

గాజ అనే ఎండ్రకాయ లేచి 'పోయిన ఎండాకాలం మిత్రులతో కలిసి ఇదే చెరువులో ఈదుతున్నాను. అనుకోకుండా ఓ ఆపదొచ్చింది. మేమున్నవైపు జాలర్లు దిగి వలలు విసిరారు. వాటిలో మేమంతా చిక్కాం. కాని వలలో చిక్కిన చేపల్ని బుట్టల్లో వేసుకుని, మమ్మల్ని మాత్రం వదిలేశారు. మేము 'బతుకు జీవుడా?' అని తప్పించుకుని వెళ్తుంటే కాకులు మామీద పడి పొడుచుకుని తినసాగాయి. ఆ ప్రమాదం కనిపెట్టిన నేను బండమీదినుండి దొర్లుకుంటూ వెళ్లాను. పక్కనే పొద వుంది. అందులో పగలంతా వుండి, రాత్రంతా ప్రయాణం చేసి తిరిగి చెరువుకు చేరుకున్నాను" అంది.

ఇంతలో భాష్ప అనే పీత లేచి "మొన్న నేను, కూక అనే ఎండ్రకాయ ఈతలో పందెం పెట్టుకున్నాం. తనో పది గజాలు ఈది, కాళ్లు నొప్పి పుట్టి ఆగిపోయింది. నేను ఇరవై గజాల దూరం ఆగకుండా ఈదాను. ఇంతవరకూ ఎవరూ ఇంతదూరం ఒకేసారి ఈదలేదు. ఇది ఒక రికార్డు. నా ఈ సాహసం మన పీతలు చాలా చూశాయి. నన్ను అభినందించాయి" అంది గొప్పగా.

"నువ్వేం చేశావు?" అని అడిగాయి మౌనంగా వున్న కుశలి అనే ఎండ్రినిచూసి.

"ఇంతవరకూ చేయలేదు. ఇక చేయాలనిపిస్తోంది మిమ్మల్ని చూశాక" అంది.

"నువ్వు కూడా ఒక రికార్డు బద్దలు కొట్టే పనిచేయి. మేమే కాదు, ఈ చెరువులోని చేపలన్నీ నిన్ను ఆకాశానికెత్తుతాయి" అంది కుళిర.

తర్వాత పీతలన్నీ తమ కలుగులోకి వెళ్లిపోయాయి. మరుసటి రోజు సాయంత్రం కూడాయి. కుశలి కనిపించలేదు. అది తరువాత రోజే గాదు వరుసగా రెండు నెలలు కనపించలేదు. ఒకనాడు కట్ట పక్కనున్న రాయి కింద విశ్రాంతి తీసుకుంటూ కనిపించింది.

"ఏం కుశలి! ఎటు పోయావు? నీ కోసం మేం చెరువంతా వెదుకుతున్నాం" అంది కుళిర.

"నేను రికార్డు సాధించే పనిలో వున్నాను. మరో పది రోజుల్లో నా పని పూర్తవుతుంది. అప్పుడు మీరంతా నన్ను మెచ్చుకోకుండా వుండలేరు'' అంది సంతోషపడిపోతూ.

'ఏం చేస్తున్నావేంటి?'అంది కుళిర.

"ఈ చెరువుకట్ట కిందిభాగం ఎనిమిది గజాల పొడవుంటుంది. దానికి నేను ఒక్కదాన్నే రంధ్రం చేస్తున్నా. ఇప్పటికి ముప్పాతిక వంతు పూర్తయింది. మిగతాది కొద్ది రోజుల్లో పూర్తి చేస్తాను. అప్పుడు దండలతో, మేళతాళాలతో నన్ను అభినందించడానికి మన వాళ్లందరినీ ఇక్కడికి రమ్మని చెప్పు" అంది వెళ్లబోతూ.

"ఓసి పిచ్చి నా పీత..! రికార్డు స్థాపించడమంటే సాహసంతో కూడినదే కాని, అది పది మందికి మేలు చేసేలా వుండాలి. మరొకరికి స్ఫూర్తినిచ్చేదిగా వుండాలి. నువ్వు చేసే ఈ పనివల్ల ఎవరికీ మేలు కలుగకపోగా, అనేక మందికి హాని జరుగుతుంది. నీ రికార్డు పూర్తయితే ఆ రంధ్రంలోనుండి నీళ్లు వెలుపలికి వెళ్లి కట్టకోతకు గురవుతుంది. అప్పుడు ఆ ప్రవాహాన్ని ఎవరూ ఆపలేరు. మనమూ ఆ ప్రవాహానికి కొట్టుకుపోతాం. చెరువులో చుక్క నీరు మిగలదు. రైతులు, కూలీలు పంటలు లేక ఆకలితో అల్లాడిపోతారు. ఇలాంటి పిచ్చిపని మరెప్పుడూ చేయకు" అని హితవు చెప్పింది.

వెంటనే అది చెరువంతా తిరిగి ఎండ్రకాయలను జమ చేసింది. వాటితో రాళ్లను తెప్పించి 'కుశలి' చేసిన రంధ్రాన్ని పూడ్చేయించింది. దాంతో చేపలు, ఎండ్రకాయలు హాయిగా ఊపిరి పీల్చుకున్నాయి.



చిన్నారి చిత్రకారులు



కె. చక్రవర్తి యాదవ్, నవభారత్ పబ్లిక్‌స్కూల్, లబ్బీపేట్, విజయవాడ.



బెల్లం శ్రీహర్ష, 10వ తరగతి, భాష్యం పబ్లిక్ స్కూల్, విశాఖపట్నం.

సయ్యద్ నాగిన్,
9వ తరగతి,
బివిఆర్‌జెడ్‌పిహెచ్ స్కూల్,
ప్రత్తిపాడు, గుంటూరు.

రంగులు అద్దుదాం



వి'చిత్రం'

చిన్నారులూ... ఈ వారం మీకోసం నిజ్జంగా ఒక వి'చిత్రం' తీసుకొచ్చాం. మా సమాధానం చదివాక మీరు కూడా అదే మాట అంటారని మాకు తెలుసులే.

అవునూ! ఈ బొమ్మ చూస్తుంటే మీకేమనిపిస్తోంది? ఇంతసేపా! వెంటనే చెప్పాలి. బాగా పరిశీలనగా చూసి చెప్పండి. ఏంటి? ఒకబ్బాయి మిద్దెపైకి ఎక్కి గిటార్ మోగిస్తున్నాడంటున్నారు ఎక్కువమంది. కానీ... మీకు ఇంతకంటే... మరేం కనిపించడంలేదా! అయితే మా జవాబు చదవాల్సిందేనర్రా! ❋

జవాబు

ఏంటీ! తెలీలేదా? అయితే ఓ పనిచెయ్యండి. పుస్తకాన్ని రెండు చేతులతో పట్టుకుని అల్లంత దూరంలో పెట్టి చూడండి. ఏం కనిపించింది? ఆ ఇళ్లన్నీ మనుషుల ముఖాల్లా వున్నాయికదూ. వారంతా పిల్లవాడు మోగిస్తున్న గిటార్ సంగీతానికి ముగ్ధులైనట్టు వుందికదూ. మరదే ఈ వారం వచిత్రం. మీ నేస్తాలకు కూడా ఈ బొమ్మ చూపించి అడగండే.

వీరి వీరి గుమ్మడిపండు... వీరి పేరేమి?

హేయ్! ఈ వారం మీ ముందుకు వచ్చిన వారెవరో ఈపాటికి మీకు తెలిసే వుంటుంది. అయినా ఈయన తెలియని తెలుగు వాళ్లు వుంటారా చెప్పండి. ఈయన పేరేంటో కార్డుమీద రాసి మాకు పంపితే మీ పేరు, తరగతి, ఊరు ప్రచురిస్తాం. మా చిరునామా: వీరివీరి గుమ్మడిపండు వీరిపేరేమి? బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

1.5.05కు సరైన సమాధానాలు రాసినవారు

ఎం.శ్రీనివాస్, 9వ తరగతి, జడ్‌పిహెచ్‌ఎస్, తొగుట, మెదక్. వైద్యరాజు సాంబశివరావు, 6వ తరగతి, లంకవీధి, పాతరామమందిరం, విజయ నగరం. బి.వి.పాండురంగారావు, 9వ తరగతి, లక్ష్మీనగర్, మెదక్.

గతవారపు జవాబు
బి.వి.రాఘవులు

ఒంటెను చేరే దారేది?



తేడాలు కనుక్కోండి

చిన్నారులూ! కింద రెండు బొమ్మలున్నాయికదా. బొమ్మలు రెండు వున్నప్పటికీ రెండిట్లోనూ ఒకరే వున్నారు. ఆ పాప భలే ముద్దుగా వుందికదూ. మీ అనుమానం మాకు అర్థమైందిలే. మూడు పిలకలు ఎందుకేసుకుందనేగా! వేసవి కాలం కాబట్టి చికాకు లేకుండా మూడు పిలకలు వేసుకుంది. తప్పేం లేదుకదా. అసలు విషయం ఏంటంటే... రెండు బొమ్మల్లోను సరిగ్గా ఐదు తేడాలున్నాయి. వాటిని మీరు చిటికెలో కనిపెట్టాలి.

బొమ్మలేయడం వచ్చా!

హేయ్ నేస్తాలూ... వేసవి సెలవుల్లో బోర్ కొడుతోందా? అయితే బోర్‌ను హుష్ కాకి చేసే ఉపాయం ఒకటి మా దగ్గరుంది. చెప్పమంటారా? ఎంచక్కా ఓ తెల్ల కాగితం తీసుకుని నల్ల స్కెచ్‌తో బొమ్మలేయండి. తర్వాత వాటికి రంగులద్ది మాకు పంపండి. మేం ప్రచురిస్తాం. మా చిరునామా: చిన్నారి చిత్రకారులు, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్.

రియల్‌స్టోరీ

✍ పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ

రాత్రి తొమ్మిది గంటలు అయింది.

న్యూఢిల్లీలో రణగొణ ధ్వనులు మాత్రం తగ్గలేదు.

వాహనాల రాకపోకలు కాస్త తగ్గినప్పటికీ హడావుడి మాత్రం తగ్గలేదు. విశాలమైన రోడ్ల వెంబడి కార్లు, పెద్ద వాహనాలు దూసుకుపోతున్నాయి.

సఫ్దర్‌జంగ్ రోడ్డులో ఆటో వస్తోంది.

ప్రయాణీకులు ఎవరూ అందులో ఎక్కలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఢిల్లీ రోడ్ల వెంబడి ఎడతెరిపి లేకుండా తిరిగిన ఆటో ఇంటి ముఖం పట్టింది. అందుకే బస్టాప్‌లలో ఒకరిద్దరు ప్రయాణీకులు ఆటోను ఆపు చేసినప్పటికీ డ్రైవర్ ఆపలేదు.

ఆ ఆటోను నడుపుతున్నది సునీతా చౌదరి

తానే ఓ కుటుంబం

ఆమె చూడటానికి అమ్మాయిలా అనిపించదు. ప్యాంటు, టీ షర్టు వేసుకుని బాబ్డ్ హెయిర్‌తో అబ్బాయిలా కనిపిస్తుంది. నిశితంగా చూసినప్పుడు ఆమె నోరు విప్పి మాట్లాడినప్పుడు మాత్రం అమ్మాయిగా ఎవరైనా గుర్తిస్తారు.

పాతికేళ్ల వయసు పెద్ద ఎక్కువేం కాదు. అయినప్పటికీ సునీతలో అదోలాంటి హుందాతనాన్ని తీసుకుని వచ్చింది. ఆమెను చూస్తే తెలిసిన ఆత్మీయురాలు అనిపిస్తుంది. ఆమె మాట్లాడితే మనకు దగ్గరి వారితో కబుర్లాడుతున్నట్లు ఉంటుంది. అందుకే చిన్న వయసు అయినప్పటికీ చాలామంది ఆమెను ఎంతో గౌరవిస్తుంటారు.

ఢిల్లీ నగరంలో రోడ్డుకిరువైపులా వెలుగుల్ని వెదజల్లుతున్న వీధి లైట్లు బారులు తీరి ఉన్నాయి. మెయిన్ రోడ్డు నుంచి సందుల్లో మలుపులు తిప్పింది సునీతా చౌదరి. ఊరికి దూరంగా కాలనీ మాదిరిగా ఉన్న ఆ ప్రాంతానికి వచ్చి ఇంటిముందు ఆటో ఆపింది.

తాళం వేసి ఆటో దిగుతుండగా ఇంటి అరుగుపైన కూర్చున్న తల్లీ కూతుళ్లు నమస్కారం చేస్తూ సునీత వద్దకి వచ్చారు. పెద్దామె వయసు యాభై సంవత్సరాలు పైబడి ఉంటుంది. అమ్మాయి వయసు ఇరవై ఏళ్లకు మించి ఉండదు. ఉదయం నుంచి ఏడుస్తున్న గుర్తుగా చెక్కిళ్లపై కన్నీళ్ల చారికలు కట్టాయి. అమ్మాయి తల ఎత్తలేక కుమిలి పోతోంది.

సునీత ఇంటిదగ్గరికి వచ్చి తాళం తీసి లోపల లైటువేసింది. మంచాన్ని జరిపి వారిని కూర్చోమని చెప్పింది. లోపలికి వెళ్లి చెంబుతో మంచినీళ్లు అందించింది.

ఇద్దరూ గబగబా చెంబుడు నీళ్లూ తాగి పక్కన పెట్టారు. తేరుకున్నట్లు వారి మొహాలను చూసి సునీత అర్థం చేసుకుంది.

"ఇప్పుడు చెప్పండి... ఎవరు మీరు... ఏమైంది?" అనునయంగా ప్రశ్నించింది సునీతా చౌదరి.

అయిదు నిమిషాల పాటు తల్లీ కూతుళ్లు మాట్లాడలేదు.

"మీ గురించి విన్నాం. ఎంతోమందికి ఎన్నో రకాలుగా సహాయం చేశారు. మీరు తలచుకుంటేనే మాకు న్యాయం జరుగుతుంది. ఎలాగైనా మీరే ఆదుకోవాలి!"

"ముందు విషయం చెప్పండి. తర్వాత ఏమి చేయాలో ఆలోచించవచ్చు!"

తర్వాత ఆ తల్లి తన కూతురుకు జరిగిన అన్యాయాన్ని ఏడుస్తూ వివరించింది. అమ్మాయి పేరు స్వప్న. ఇరవై ఏళ్లుంటాయి. మధ్య తరగతి కుటుంబానికి చెందినది. రాత్రి ఏడుగంటల సమయంలో ఒంటరిగా వస్తుండగా ముగ్గురు యువకులు అడ్డగించారు. ప్రతిఘటించలేక పోయింది. అత్యాచారానికి గురైంది. జరిగిన అన్యాయం గూర్చి ఎవరికి చెబితే ఏమి అవుతుందో తెలియదు. అందువల్ల తెలిసినవారి ద్వారా సునీతా చౌదరి అడ్రసు కనుక్కుని వచ్చారు.

సునీత విషయం విన్న తర్వాత ఎలర్టు అయిపోయింది. "ఆ వ్యక్తులు ఎవరో తెలుసా?"

ఆ అమ్మాయి తెలుసు అన్నట్లు తల ఊపింది.

వెంటనే వారిద్దరినీ ఆటోలో కూర్చోమని చెప్పి, ఇంటికి తాళం వేసి ఆటోను స్టార్ట్ చేసింది. సందుగొందులన్నీ తిప్పి మెయిన్‌రోడ్‌పైకి వచ్చింది. ఆ పరిధిలో ఉన్న పోలీసు స్టేషన్‌కి వెళ్లి అమ్మాయి చేత ఫిర్యాదు రాయించి పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్‌కు అందజేసింది. తర్వాత వారి సిఫార్సుతో సమీపంలో ఉన్న ప్రభుత్వాసుపత్రికి వెళ్లి బాధితురాలిని పరీక్ష చేయించింది. తర్వాత వారిని వారి ఇంటివద్ద దింపింది.

ఈ పనులన్నీ ఎంతో సమర్థవంతంగా చేస్తున్న సునీతను తల్లీకూతుళ్లు ఇద్దరూ ఎంతో ఆరాధనతో చూశారు. చేతులెత్తి నమస్కరించారు. "ఎవరూలేని మాకు అండగా నిలిచావు. నీ మేలు మరిచిపోలేము" అని చెప్పారు.

"పోలీసు స్టేషన్‌కు, కోర్టుకు వెళ్లవలసిన అవసరం ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గవద్దు. ఎవరు బెదిరించినా నాకు చెప్పండి. అన్యాయం జరిగినప్పుడు బాధ పడేకన్నా ఎదిరించాలి. కొంతమంది అయినా ఇటువంటి ధైర్యం చూపిస్తే మరెంతో మంది వారిని అనుసరిస్తారు" అని చెప్పి ఆటో స్టార్ట్ చేసింది.

ఇంటివద్ద ఆటోను ఆపింది. కిటికీలోంచి వీస్తున్న గాలి శరీరానికి హాయిగా తగిలింది. అలా మంచంపై వాలిపోయింది సునీత

* * *

సాహసానికి ప్రతీకగా ఉండే సునీత జీవితం చిన్నప్పటి నుంచీ ఒడిదుడుకులతోనే ముందుకు సాగింది.

ఉత్తరప్రదేశ్ మీరట్ సమీపాన బహదూర్‌పూర్ గ్రామంలో సునీత మధ్య తరగతి కుటుంబంలో పుట్టింది. పుట్టుకతోనే కష్టాలను కూడా కొనితెచ్చుకుంది. ఆ గ్రామంలోనే ప్రాథమిక విద్యాభ్యాసాన్ని పూర్తి చేసింది.

ఇంటర్మీడియెట్ వరకూ మాత్రం ఎటువంటి

ఒడిదుడుకులు లేకుండా సజావుగా సాగింది.

ఆ తర్వాత పై చదువులు చదివించలేమని ఆమె తల్లిదండ్రులు చేతులు ఎత్తేశారు. అమ్మాయిలకు అంతకన్నా చదువు అవసరం లేదని పెళ్లి ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఎదిగిన పిల్లను ఇంటిలో నుంచి ఎలాగోలా అత్తవారింటికి పంపితే తమ బాధ్యత తీరిపోతుందని భావించే అందరు తల్లిదండ్రుల మాదిరిగానే సునీత తల్లిదండ్రులు కూడా ఆలోచించారు.

ఢిల్లీకి చెందిన వసంత్ పంకజ్ అనే వైద్యునితో ఆమె వివాహం జరిగింది. పెళ్లి నాటికి కట్నకానుకలు సమర్పించడమే కాకుండా ఉన్నంతలో ఘనంగా జరిపించారు.

అయితే అందరూ అనుకున్నట్లు పంకజ్ అంత మంచివాడు కాదని పెళ్లయిన కొద్దిరోజుల్లోనే అర్థమైపోయింది. భర్త, అత్తమామల నుంచి వేధింపులు మొదలయ్యాయి. ఇచ్చిన కట్నం సరిపోలేదని, అదనంగా కట్నం డబ్బులు కావాలని చిత్రహింసలు పెట్టేవారు. ఈమె చనిపోతే మరో పెళ్లి చేసుకోవచ్చునన్న దురాలోచన కూడా సాగించారు.

సునీత ప్రాణాలు తీయడానికి అత్తింటివారు నిర్ణయించుకున్నారు. ఇంటిలో ఉన్నప్పుడు రకరకాల ప్రయత్నాలు జరిగాయి. స్వతహాగా తెలివైనది, ధైర్యం కలది కావడంతో సునీత ప్రతిఘటించేది. ఎప్పటికప్పుడు తనను తాను రక్షించుకోవడానికి అవస్థలు పడేది.

ఒకసారి అత్తమామలు, భర్త కారులో హర్యానా తీసుకువెళ్లారు. ప్రమాదంలో చనిపోయిందని నమ్మించడానికి వ్యూహాన్ని రూపొందించారు. గర్భవతి అని చూడకుండా ప్రమాదం పేరుతో హత్య చేయడానికి ప్రయత్నించారు. ఈ విషయాన్ని గుర్తించింది. ఎలాగోలా తప్పించుకోవాలని నిర్ణయించుకుని అవకాశం లభించగానే వారి కళ్లు కప్పి పరారీ అయిపోయింది. వారి నుంచి తప్పించుకున్న వెంటనే రెండు రాత్రులు రెండు పగళ్లు ఏకబిగిని పరుగులతోనూ, నడకతోనూ ప్రయాణం చేసి ఢిల్లీ చేరుకుంది.

ఢిల్లీ చేరుకున్న వెంటనే స్పృహ తప్పి రోడ్డుపైన పడిపోయింది.

గర్భవతిగా ఉండటం వల్ల ఆమె పరిస్థితి ఎంతో దయనీయంగా తయారైంది. స్థానికులు కొంతమంది ఆమెను గమనించి ఎయిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. ఏడవ నెలలో బిడ్డకు జన్మను ఇచ్చింది. పుట్టిన మూడవ రోజునే బిడ్డ చనిపోయింది.

ఒంటరితనం, కడుపుకోతల మధ్య సునీతా చౌదరి పూర్తిగా నిగ్రహాన్ని కోల్పోయింది. తనను అంతమొందించాలని ప్రయత్నించిన అత్తవారింటివైపు అసలు వెళ్లకూడదని అనుకుంది. మనోస్థయిర్యాన్ని కోల్పోకుండా తనని తాను నిగ్రహపరుచుకుంది. ఎలాగైనా బతకాలి. ధైర్యంగా బతకాలి. తనలా ఇబ్బంది పడుతున్న ఎంతోమందికి అండగా ఉండాలి. వారి సమస్యలు తన సమస్యలుగా తీసుకుని వారి తరపున తాను నిలబడాలని అనుకుంది.

అందుకు అనుగుణంగానే ఉద్యోగ ప్రయత్నాలను మొదలుపెట్టింది. ఎన్నో కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగి పోయేలా తిరిగింది.

రెండురోజులపాటు దీర్ఘంగా ఆలోచించింది. ఒంటరితనంతో ఎలా బతకాలని పరిపరి విధాలుగా ఆలోచించింది.

ఆ సమయంలో టాక్సీడ్రైవర్ కావాలని అనుకుంది.

టాక్సీ కొనుగోలు కష్టం అవుతుందని ఆటో డ్రైవర్‌గా మారాలని అనుకుంది. ముందుగా డ్రైవింగ్ లైసెన్సు పొందడానికి డ్రైవింగ్ శిక్షణ పరిశోధనా (ఐ.టి.డి.ఆర్) సంస్థలో చేరి వివిధ వాహనాలు నడపడంలో శిక్షణ పొందింది.

అయితే వ్యాపారాత్మకంగా వాహనాలు నడపాలంటే దానికి ప్రత్యేక అనుమతి అవసరం. కమర్షియల్ లైసెన్సు కోసం అన్ని రకాల ప్రయత్నాలు చేసింది. స్త్రీ అన్న కారణంగా అధికారులు అనేక అడ్డంకులు కల్పించారు. ఇందుకోసం ఆమె ఎంతోకాలం పోరాటం చేసింది. ఆ సంస్థలో ఓ మహిళా అధికారి సహకారంతో ఎట్టకేలకు లైసెన్సు లభించింది.

దాంతో ఢిల్లీ వీధుల్లో ఆటో డ్రైవర్‌గా ఆమె అవతారం ఎత్తింది. ఉదయం 8 నుంచి రాత్రి 9గంటల వరకూ నిరంతరాయంగా కష్టపడితే అయిదువందలు లభించేవి. అందులో కొంతసొమ్ము ఓనర్‌కు చెల్లించి కొంత మిగుల్చుకొనేది. కొంతకాలం పాటు ఈ విధంగా ఆటో నడిపిన తర్వాత తానే స్వంతంగా ఆటో ఎందుకు కొనుక్కోకూడదని ఆలోచించి ఫైనాన్సుతో ఆటోను తీసుకుంది. రోజూ తనకు లభించే ఆదాయంలో నెలవారి వాటాలు చెల్లించి ఆరునెలల్లోనే ఆటోఓనర్ అయిపోయింది.

రోజూ విధి నిర్వహణ కోసం ఉదయాన్నే వెళ్ళిపోయి ఏ సాయంత్రమో ఇంటికి వచ్చేది. ఆ సమయంలోనే కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవాలని ఆమె నిశ్చయించుకుంది. అందుకు తగిన ప్రయత్నాలు కూడా ప్రారంభించింది.

* * *

న్యూఢిల్లీ. పాటియాలా హౌస్‌లో లీగల్ ఎయిడ్ కేంద్రం.

వరకట్నం, వేధింపులు, అత్యాచారం వంటి వివిధ రకాల ఇబ్బందులకు గురైన మహిళలు ఎవరైనా అక్కడ ఫిర్యాదు చేయవచ్చు. అన్యాయం జరిగినవారు ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు ప్రతిని పంపి పరిష్కారం అయ్యేంతవరకూ ఆ సంస్థ కృషి చేస్తుంది.

ప్రతిరోజూ ఎంతోమంది వస్తుంటారు.

ఒక్కొక్కరు ఒక్కో రకమైన ఇబ్బందులను తెలియజేసుకుంటే అందుకు తగిన పరిష్కారాలను సంస్థ చూస్తుంది. న్యాయవాదులు, మహిళా సంఘాల ప్రతినిధులు, మానవహక్కుల నేతలు ఎంతోమంది ఆ సంస్థకు చేయూతనిస్తున్నారు.

ఆ సంస్థ ప్రధానవ్యక్తి సునీతా చౌదరి

ఆటోడ్రైవర్‌గా ఉపాధి పొందుతూ ఆదివారం పూట బాధితులైన మహిళల కోసం తన సమయాన్ని వెచ్చిస్తోంది.

ఆ ఆదివారం సునీత కోసం ఓ అమ్మాయి వచ్చింది.

ఆమె చేతిలో రెండేళ్లపాప వుంది. ఆమెను చూడగానే సునీత గుర్తు పట్టింది. "నువ్వు స్వప్న కదూ! నీ కేసులో నీకు న్యాయం జరిగింది.

ఈ సంచిక ప్రత్యేక ఫొటో

ఘనా కుటుంబం

నిందితుడికి శిక్ష పడింది. కానీ నాపై దాడి జరిగింది. కోలుకోవడానికి రెండేళ్లు పట్టింది!" అని స్వప్న చెప్పింది. తర్వాత ఆమె సంగతులు తల్లి విషయాలు అడిగి తెలుసుకుంది.

"మీకింత ధైర్యం ఎలా వచ్చింది!"

"ఢిల్లీ మహిళలు రాత్రిపూట ఒంటరిగా వెళ్లడానికి భయపడతారు. వారికి ధైర్యాన్ని ఇవ్వాలి. రాత్రి పూట ఒక మహిళ ఆటో నడపడం ఆషామాషీకాదు. అందుకే భోపాల్‌లో కరాటే నేర్చుకున్నాను. యోగా కూడా నేర్చుకున్నాను. ఆత్మ స్థైర్యం ఉంటే ఎలాంటి కష్టాలనైనా ఎదుర్కోవచ్చు. భయపడితే ఈ పాడు సమాజం మరింత భయపెడుతుంది. అందుకే ఆటంకాలు ఎదురైనా ధైర్యాన్ని అలవరచుకోవాలి" సునీత అంది.

స్వప్న చేతిలో పాప కేరింతలు కొడుతోంది.

"పాప అచ్చం నీ పోలికే...!"

స్వప్న చిన్నగా నవ్వింది. "ఆయన కూడా ఎంతో సహృదయులు. జీవితం సాఫీగా సాగిపోతోంది. ఎందుకో మిమ్మల్ని చూడాలనిపించింది. ఇక్కడ ఉన్నారని పేపర్లో చదివి వెతుక్కుని వచ్చాను!" అంది.

"థాంక్స్!" అంటూ పాప కోసం పక్క షాపులోంచి బిస్కట్ పేకెట్ తెప్పించి ఇచ్చింది. వెళతామని స్వప్న లేచి నిలుచుంది. గేటు వరకూ వెళ్ళి సునీత వీడ్కోలు పలికింది.

"ఇంతకు పాప పేరు చెప్పలేదు!"

స్వప్న రెండు క్షణాలు ఏం మాట్లాడలేదు. వెంటనే జవాబు కూడా స్ఫురించలేదు "అవును చెప్పడం మరిచిపోయాను. మా పాప పేరు సునీతా చౌదరి!" అంది.

ఆటోడ్రైవర్ సునీతా చౌదరి కళ్లు చెమర్చాయి.

అత్త, మామ, భర్త, పిల్లాపాపలతో కూడిన కుటుంబంలాంటిది నాకెందుకు లేదు అని ఒక క్షణం అనిపించింది.

తన సహకారంతో విడిపోబోయి తిరిగి ప్రేమమయమైన మరో కుటుంబం తనను కలవడానికి వస్తున్నారు.

ఏం పరవా లేదు... నేనే ఒక కుటుంబం... వసుధైక కుటుంబం అని తృప్తిగా గాలిపీల్చుకుంది.

స్వప్నకు వీడ్కోలు చెప్పి తన కోసం వచ్చిన దంపతుల్ని ఇంట్లోకి తీసుకెళ్లింది.

*

జీవనశైలి

కుటుంబ వ్యవస్థ మార్పు మన చేతుల్లోనే...

ముదిగంటి సుజాతారెడ్డి

లలితతో పాటు వనజ కూడా వచ్చింది. వనజను చూసి చాలా రోజులయింది. వనజ మహిళాభ్యుదయ కార్యక్రమాలలో బిజీగా ఉంటుంది.

"వనజతో నేను కూడా వెళ్ళాను సుశ్మీ! ఈ మధ్య ఎవరినడిగినా ఆడవాళ్ళు తమ మీద జరిగే హింస గురించే చెప్తున్నారు. అక్కడికీ కుటుంబ గౌరవం మర్యాదలనీ చాలామంది స్త్రీలు లైంగిక వేధింపులను, శారీరక హింసలను తమలో తాము భరిస్తూనే ఉన్నారు. కానీ పైకి చెప్పుకోవటానికి ముందుకు రావటం లేదు" అంది లలిత కొంత విచారంగా.

"సమాజంలో కుటుంబాల్లో జరుగుతున్నది అదేకదా లల్లీ. సంపాదిస్తున్నాను గదా అని పురుషులు పెత్తనం చలాయిస్తారు. స్త్రీలను బానిసలనుకుంటారు! వాళ్ళకు కోపం వస్తే స్త్రీలను హింసిస్తారు. అంతే కాదు తమ జన్మాధికారం అయినట్లుగా తాగుతారు. తాగి భార్యల మీద దాడులు చేస్తారు. కొడ్తారు... హింసిస్తారు... స్త్రీలు పవిత్రత, మర్యాదలు గౌరవాలు అంటూ సహనంతో అన్నీ భరిస్తారు" అన్నాన్నేను.

"అదే సుశీలగారూ! అక్కడే వచ్చింది కష్టం!... స్త్రీలకు సహనం సంప్రదాయం మర్యాదలు నరనరాల్లో జీర్ణించుకపోయాయి! మనం చెప్పినా అర్థం చేసుకోరు! మనమూ తిరగబడితే ఈ కుటుంబం, పిల్లలూ ఏమౌతారు!... అంది వనజ.

"అంతే వనజా! ఆడవాళ్ళ సహనంతోనే మన దేశంలో ఈ కుటుంబ వ్యవస్థ నిరాటంకంగా కొనసాగుతున్నదని చెప్పాలి. స్త్రీలల్లో తమ మీద జరిగే అన్యాయాలు దోపిడీ హింసలను గురించి స్పృహ కలగాలి! చైతన్యం రావాలి! కుటుంబ వ్యవస్థ మారాలి!" అంది లలిత ఆవేశంగా.

"అప్పటికీ ఇప్పటికీ కుటుంబ వ్యవస్థ మారింది. కాని పురుషుల ఆలోచనా విధానంలో మాత్రం మార్పు లేదనిపిస్తుంది లల్లీ! పూర్వకాలంలో ఉమ్మడి కుటుంబాల్లో ఆడవాళ్ళు ఏ స్వాతంత్ర్యం లేకుండా ఇంటి పనులకు, మగాళ్ళ కోరికలను తీర్చటానికి, పిల్లల్ని కనటానికి పరిమితమై బతికారు. అంతెందుకు రెండో ప్రపంచ యుద్ధ కాలంలో హిట్లర్, ఆడవాళ్ళ జీవితం మూడు "కే"లకు - కిర్చే (చర్చి), కింటర్ (పిల్లలు) క్యూషే (వంటిల్లు)లకే పరిమితం కావాలన్నాడు. అయితే మానవ హక్కుల పోరాటంలో భాగంగా స్త్రీ ఉద్యమాలలో ఆడవాళ్ళ జీవితంలో చాలా మార్పులు వచ్చాయి. ఉమ్మడి కుటుంబాల్లోని నియంతృత్వం నుంచి ఛాందసమైన భావ వలయాల నుంచి, మూఢ నమ్మకాల విషజ్వాలల నుంచి బయటపడ్డారు. మైక్రో-'చిన్న' కుటుంబాలు వచ్చాయి. భూస్వామ్య సంస్కృతి నుంచి స్త్రీలు కొంతవరకు బయటపడ్డారు. "మనమిద్దరం... మనకిద్దరు" అనీ... ఇప్పుడైతే "మనమిద్దరం మన కొక్కరే" అనే నినాదంతో చాలా చిన్న కుటుంబాలే కన్పిస్తున్నాయి. అటువంటి కుటుంబాల్లో కూడా నిర్ణయాధికారం అంతా మగాళ్ళదిగానే వుంటున్నది. కుటుంబంలో అప్పుడూ ఇప్పుడూ స్త్రీలకు తమ అభిప్రాయాన్ని చెప్పే స్వాతంత్ర్యం లేదు. సంపాదిస్తున్నాను పడివుండు అనే ధోరణే కన్పిస్తున్నది" అన్నాన్నేను ఇద్దరి వైపు చూస్తూ.

ఆడవాళ్ళు ఇంట్లో ఎంత చాకిరి చేసినా దానికి గుర్తింపు మెప్పులేదు. అదే మగవాడు ఆఫీసు నుంచి అలసిపోయి వస్తే భార్య నవ్వుతూ పలకరించి సేదదీర్చి సేవలు చేయాలి! అదే ఆడవాళ్ళు ఆఫీసుల నుంచి, కూలిపనుల నుంచి వచ్చి చచ్చినట్లు ఇంటిపనులు, వంట పనులు, పిల్లల బాధ్యతలు చూసుకోవాలి! ఉద్యోగం చేసే స్త్రీలకు కూడా ఇంటిపనుల నుంచి విముక్తి లేదు! ఎప్పటికీ బానిస బతుకే!" అంది లలిత ఉపన్యాసం ఇస్తున్నట్లుగా. "లల్లీ! నువ్వనేది నిజమే కాని! ఎంతో కొంత భద్రత రక్షణలను కుటుంబం ఇస్తుంది. కాబట్టే అది ఇన్నాళ్ళు నిలబడింది. ఈ ఆధునిక కాలంలో దాన్ని మార్చే మార్గాలు ఎన్నో ఆడవాళ్ళ చేతుల్లో వున్నాయి. అంటే చూడు! పిల్లల్ని పెంచేటప్పుడు అవి ఆడ పిల్లల పనులు, ఇవి మగ పిల్లల పనులు అనే భేద భావంతో పెంచకూడదు. అప్పుడే పెద్దయ్యాక మగపిల్లలు ఏ అహంభావం లేకుండా అన్ని పనులు చేస్తారు! చేసుకుంటారు! ఆడపిల్లలకు, మగపిల్లలకీ సమానావకాశాలు... సమానతలుంటాయనేటట్లుగా పెంచాలి. అంటే భవిష్యత్ తరాలను స్త్రీ పురుషులనే విభేదాలకు దూరంగా వుండేటట్లుగా పెంపకంలో తల్లులు శ్రద్ధ తీసుకోవాలి. అప్పుడు కుటుంబంలోగాని సమాజంలోగాని ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య వాతావరణం ఏర్పడుతుంది. వివాహ జీవితంలో కూడా భార్యాభర్తలు ఏ అహంభావాల్లేకుండా సమాన గౌరవంతో పరస్పర అవగాహనతో జీవించటం అలవాటవుతుంది. ఇదంతా ఆడవాళ్ల చేతుల్లో వుందంటావా! లేదా!" అని అడిగాన్నేను వనజ, లలితల వైపు చిరునవ్వుతో చూస్తూ.

"సుశ్మీ! నువ్వనే పెంపకం బాగానే వుంది. కాని మగవాళ్ళు ఇంటి పనుల్లో చెయ్యి వేస్తేనేగాని స్త్రీలకు ఇంటిచాకిరి నుంచి విముక్తి కలగదు. చాకిరి తప్పితేనే స్త్రీలల్లో బుద్ధిచాతుర్యం, సృజనాత్మకతలు వికసిస్తాయి. అవునా! కాదా?" అంది లలిత.

అవును లల్లీ! మరోటి లల్లీ! వనజా! మన ఆహారపు అలవాట్లలోనూ చాలా మార్పురావాలి అనుకుంటున్నాను. ఇది వరకే గ్యాస్ కుక్కర్స్ మైక్రోఓవెన్‌లతో మన వంటిట్లో మార్పులు, వేగం వచ్చాయి. కాని తినే ఆహార పదార్థాలల్లోనూ మార్పు రావాలి. సలాడ్‌లు, పండ్లు ఎక్కువగా తినటం ఒకటి! కొందరికి ఎన్ని ఫలహారాలు తిన్నా మళ్ళీ అన్నం తినందే అన్నట్లుగా లేకపోవటం వంటి విషయాల్లో మార్పు రావాలి. అప్పుడు స్త్రీలకు వండే భారం తగ్గుతుంది. ప్రభుత్వం పన్నుల భారం లేకుండా తక్కువ ధరల్లో రెడీమేడ్ ఫుడ్‌లు మంచి రకాలెన్నో లభించేట్లుగా చూడాలి! అప్పుడే ఆడవాళ్లకైనా, మగవాళ్ళకైనా ఇంటి చాకిరి, వంటపనుల భారం తగ్గుతుంది. అప్పుడు తమ పనిలో ఉత్పత్తి ఫలితాలను ఎక్కువగా సాధించగలుగుతారు!" అన్నాన్నేను. "అంటే ఎప్పుడూ వ్యవస్థలను తప్పుపట్టి నశించాలనేదానికన్నా స్త్రీలు ఆ వ్యవస్థలను విప్లవాత్మకంగా మార్చుకునే మార్గాలను చూడాలంటావు అంతేనా! సుశ్మీ!" అంది వనజ. ఆమె ముఖం ప్రశాంతంగా వుంది.

"అంతేమరి! ఏ శ్రమా లేకుండా చేసే ఇన్‌స్టంట్ కాఫీ తెస్తాను. మీ ఇద్దరికీ" అని లేచాన్నేను.

ఈ సంచిక ప్రత్యేక ఫోటో



ఇంగ్లాండ్ కుటుంబం

నువ్వద్ది

మీ ఇంటికత్తె ఏమిత్తవు... మా ఇంటికత్తే ఏం దెత్తవు...

కాలువ మల్లయ్య

మా తాతున్నంతసేపు అయినే ఇంటి పెద్ద... మా నాయన పెద్దోడు... ముగ్గురు చిన్నాయిన్నలు... మా తాత ముందట ఎవ్వలేం మాట్లాడెటోల్లుగాదు. అందరు అయినె చెప్పినట్టు వినెటోల్లు... అరుగుమీద మంచమేసుకొని గంభీరంగ కూసెండెటోడు... అందరికీ తలోపని చెప్పెటోడు... ఎవ్వలుగూడ ఎదురు మాట్లాడెటోల్లు గాదు... మా నాయిన్నవ్వ ఇంటి యజమానురాలుగద... అంటె వంటింటికి రాజన్న మాట... కోడండ్లకు పని చెప్పేది. మా తాత బతికున్నన్ని రోజులు మా నాయిన్నలు నలుగురు మంచిగ కల్సున్నరు. వేరువడుదన్న మాటే రాలేదు. అందరు ఒక్క మాటమీద ఉండేటోల్లు. ఎవ్వలవనాల్లు చేసుకునేటోల్లు... కుండలగలది తినెటోల్లు... ఏది జేసినా అంత పొత్తుల ఎవ్వారమే...

నాకు ముగ్గురు చిన్నాయిన్నలు గద...! పిల్లగాల్లండ్ల అందరికన్న ముందు పుట్టినోన్ని నేనే అందుకే అందరికి నేనంటె 'పావురం'... గావురం... అరుగుమీద కూసోని అందరు చల్లగట్కో బువ్వో ఏదుంటె గది తినెటోల్లు... రా బిడ్డా రా అని నన్ను పిలిచెటోల్లు... నేనందరి కంచాల దగ్గరకు పోయేటోన్ని. తలో బుక్క నోట్లో పెట్టెటోల్లు. ఎవ్వలేది కొనుక్కచ్చినా నాకియ్యకుంట తినెటోల్లు గాదు. నేను కొంచెమంత పెరిగినంక మా చిన్నాయిన్న పిల్లలను ఎత్తుకునెటోన్ని... మా తాత నన్ను నెత్తిమీద కూసుండబెట్టుకోని ఊరంత తిప్పుకచ్చెటోడు... మా తాతున్నన్ని రోజులు అయినే ఇంటికి రాజు... ఏరువడుదు అనే మాటేరాలేదు.

అటెనుక మా నాయిన్న ఇంటికి యజమానయిండు... మా నాయిన్నముందట మా చిన్నాయిన్నలు వినయంగ ఉండేటోల్లు... అయినె చెప్పినట్టు వినెటోల్లు... అయితె కొన్నొద్దులయినంక ఆడోల్ల ఒత్తిడెక్కువయింది. అన్నదమ్ములు వేరుపడ్డరు. అప్పడ్డాక ఎవ్వలింట్ల ఏ కార్యమయినా అన్ని పొత్తుల్నే చేసెటోల్లు... అటెనుక ఎవ్వలదాల్లే. అయితె అందరేరువడ్డా మా నాయిన్న సలహా తీసుకునెటోల్లు... ఏ పనికయిన మా నాయిన్న నడుగంది చేసెటోల్లు గాదు...మరి నా కొడుకుల దగ్గరికచ్చేవరకు ఎట్లయిందనుకున్నరు...? పెండ్లాం సేతికచ్చిందో లేదో ఏరువడుదామన్ని... ఏరువడితెనె మేలు మొగడా మరి పొత్తుంటేనే పోరు మొగడా అన్నట్టాయె. ఎవ్వల మొగుల్లను ఆల్లు సంకలేసుకోని పోయిరి. ఒక్కల మాట ఒక్కలు వింటలేకపెయిరి. మా నాయిన్నలు గన్నేండ్లు కలిసుండిరి. నేనంటె ఒక్కన్నే కొడుకునయితి. మా పోరగాండ్ల అందరి లగ్గాలాయె దాకన్న కలిసుండకపొయిరి.

ఈ కాలమే గిట్లుందా ఏంది...? ఎవ్వరికి వారే యెమునాతీరే అన్నట్టు చెయ్యవట్టిరి. అరె నీయవ్వ...! ఊల్లె గూడ ఎట్లయిపోతంది...? వరుసలతోని మంచిగ పిలుసుకు నెటోల్లం- ఎవ్వలింటికి పెయినా చల్ల వట్టిగనే పోసెటోల్లు ఎవ్వల తోట్లకు పెయినా కూరగాయలుట్టిగనే ఇచ్చెటోల్లు. ఇప్పుడు పాలమ్ము కోవట్రి - పెరుగమ్ముకోవట్రి... ఆఖరుకు నీళ్ళు గూడ అమ్ముకోవట్టిరి.

అవ్వయ్యలు గూడ బరువైతండ్రు...

గింత ఇషపాతుకాలనైతె నేనెప్పుడు జూల్లే.

ఎందుకు గిట్లయితంది మరి...?" బాధ పడకుంటన్నడు వేమారెడ్డి...

"బాగ జెప్పినవోయ్ వేమారెడ్డి... ఎంతెంత కథోలె జెప్పితివి... గిట్లెందుకైతందంటె గిది తరాల్లున్న అంతరాలతోని గప్పటికి గిప్పటికి ఎన్ని మార్పులచ్చినయని... అప్పుడు అందరు వ్యవసాయాలతోని బతికెటోల్లు... గిప్పుడు చదువులు, నౌకర్లు కూడా వచ్చినయ్...? అంటె సంపాదనలల్ల తేడాలు వచ్చినట్టే కద...! సంపాదనలల్ల తేడాలచ్చినంక కలిసెట్లుంటరు...! సంపాదనల తేడాలత్తె కుటుంబ సంబంధాలల్ల గూడ తేడాలత్తయి. ఎప్పటికొక్క తీరుగనే ఉండాన్నంటె నడుత్తదా..."

"అంటె ఇప్పుడు ఇంత పొడుగు మంచి గైందంటవొ సత్తయ్య"...

"సంగతులు సరిగ్గ అరుతం జేసుకోవన్నోయ్ వేమారెడ్డి... మీరంటె రెడ్డోల్లు. అయినా కాపోల్ల తీరే అనుకో... మునుపు అన్ని కులాలోల్లు నదివే అవకాశముండెనా...? కుల భేదాలుండేటియా...? గిప్పుడు పూరాగ గాకున్నా అన్ని కులాలోల్లు కొంచెమన్న సదువు కుంటుండ్రా, లేరా? కుల భేదాలు మునుపటంతున్నయా? అన్ని కులాలోళ్ళు, సదువులతోని, నౌకర్లతోని జీవితాలను గెలుచుకుంటున్నరా లేదా...? దళితులు దొరల పిల్లల మీద చేతులేసి తిరుగుతాండ్రా లేదా? మునుపు దొరలె సర్పంచ్‌లయ్యెటోల్లు. గిప్పుడు అన్ని కులాలోల్లు ఐతున్నరు గద... మరిగిది మంచి మార్పుగదా...? "గా మాట నిజమేకని ఒగలనొగలు వట్టించుకుంటుండ్రా... ఎవ్వలదారి వాళ్ళదేనాయె.. బాగ విషపాతుకాలు పెరిగె గా ఓదన్న ఎవ్వలకు రోగమచ్చినా పంచె భుజానేసుకోని అన్నా కరీంనగర్ దవాఖానాకు తీసుకపోయెటోడు. గయినె కొడుకేం జేత్తండు...? అయినదయినె చూసుకుంటున్నడు గద... ఏమంటవే రాజమల్లన్న.. మరి మునుపు మంచి గున్నదంటవా...? గిప్పుడా...?"

గప్పుడు నోరు దెర్చిండు రాజమల్లు.

"గిదంత వడ్ల పెరుగు కలిపినట్టుంది. గిది గెలుపో ఓటమో చెప్పొచ్చెటట్టు లేదు. మీదికి జూత్తె గీ మార్పులన్ని గెలుపే అనిపిత్తయి. కాని మనిషి మనిషి నడుమ సంబంధాలల్ల బాగా తేడాలచ్చినయ్. కుటుంబ

సంబంధాలు, మానవ సంబంధాలు నాశనమయిపోతున్నయి. మునుపు ఊళ్ళె కులభేదాలున్నా ప్రేమలుండేటివి. ఒగల నొగలు అరుసుకునెటోల్లు. గిప్పుడు కుటుంబ సంబంధాలన్ని డబ్బు సంబంధాలుగ మారిపోతున్నయి. నీతోని మాట్లాడితె నాకేమత్తదన్నట్టుంది సంగతి. అన్ని లాభాల నష్టాల మోజుల నడుత్తున్నయి.

ఇవన్ని జూత్తంటె జీవితాన్ని గెలుచుకున్నట్టే అనిపిత్తందా? గెలుచుకుంటె ఎంతమంది గెలుచుకున్నరు...? మరిగిది ఓటమయితదా?

ఇగో నేనొక్క మాట చెప్పుత వింటరా...? కోడండ్లు వాల్ల మొగుల్లనాల్లు తీసుకుపోయిరి... ఆడోల్లు వత్తిడెక్కవాయె అని ఆడోల్లననుడు తప్పు.

సమాజం "మేము" నుండి "నేను" దిక్కు నడుస్తంది. గా "నేను" డబ్బే అయితంది. ఆ డబ్బు అందర్ని మార్చుత్తంది. నేను నేను అంటె గండ్ల సుఖమేముంటది...? ఇగ ఒగల్నొగలు ఎందుకు పట్టించుకుంటరు...?

పెండ్లి సంబంధాలు, కుటుంబ సంబంధాలు, మానవసంబంధాలన్నీ డబ్బు సంబంధాలయితేమన్నట్టు...? అందుకే గిట్లనిపిత్తంది.

అందరు గట్లనే ఉన్నరని కాదుగని డబ్బే అన్ని అనుకుంటె మాత్రం దుఃఖం తప్పది.

ఇగో...! గిదెట్లున్నదంటె నువ్వు మా ఇంటికత్తె నాకేమిత్తవు... నేను మీ ఇంటికత్తె నాకేందెత్తవు... అన్నట్టుంది...? అన్నడు రాజమల్లు...

❖

ఈ సంచిక ప్రత్యేక ఫొటో

జర్మన్ కుటుంబం

ఆరోగ్యం

కుటుంబ జీవితాన్ని కుంగదీస్తున్న ఫ్లోరోసిస్

-డా॥టి. సేవకుమార్,
యం.బి.బి.యస్.,

మనదేశంలో అనేక రాష్ట్రాలలోని కొన్ని జిల్లాలను సందర్శిస్తే... అక్కడ ఎక్కడ చూసినా బతుకు ఛిద్రం అయిపోయిన వారు కనిపిస్తారు. కాళ్ళు, చేతులు చిత్ర, విచిత్ర ఆకారాలలో వంకర్లు తిరిగి పోయి వుంటాయి. వెన్నెముక వంగిపోయి సహజ కదలికల లక్షణాన్ని కోల్పోయి ఉంటుంది. కనుక కదలికలుండవు. నిటారుగా నిలబడలేరు. సాఫీగా



నడవలేరు. సరిగ్గా కూర్చోలేరు. ఏ పనీచేయలేరు. మూడుపదుల వయస్సుకే అంతా అయిపోయి వృద్ధాప్య లక్షణాలు కనిపిస్తాయి. కనీసం ఇంటికో మంచం బాధితులకు అంకితం. ఏదో ఒక ఆధారం లేకుండా లేవడం కష్టం. కర్ర లేకుండా నడవడం కష్టం. అందుకు పేద, ధనిక తేడాలు లేవు. స్త్రీ, పురుష భేదం లేదు. పిల్లలు, పెద్దలు వయస్సుతో నిమిత్తం లేదు. ఆ ప్రాంతాలలో పుట్టిపెరిగినా కొన్ని సంవత్సరాలు అక్కడి నీరు తాగినా, వంటకు వాడినా వారికి ఆ పరిస్థితులే ఎదురవుతాయి. అందుకు అక్కడ భూగర్భ జలాలలోని ఫ్లోరైడే కారణమని ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. 20 ఏళ్ళ వయస్సు దాటినా ఎదుగుదలలేక ఇంకా తల్లి చంకలోనే కనిపిస్తున్నారు. 16 ఏళ్ళ వయస్సులోనే 60 ఏళ్ళ వృద్ధాప్యపు ఛాయలు చవిచూస్తున్నారు. సంవత్సరాలకు సంవత్సరాలే దొర్లిపోతుంటాయి.

అక్కడ 50 సంవత్సరాలు మించి ఎవరైనా బతికితే గొప్పగానే భావించాలి. ఒక వయస్సుకు చేరాక బతికినంతకాలం కూడా రేపో మాపో అన్నట్టు మృత్యువుతో సహజీవనం చేయడం తప్పదు. ఆ దృశ్యాలు కొత్తవారికైతే ఇప్పుడా ఇంకాసేపా అన్నట్లుగా అనిపిస్తాయి. మెడపైకి ఎత్తలేరు. అటూ ఇటూ తిప్పలేరు. నడుము వంగదు. పక్కకు చూడాలంటే శరీరమంతా తిప్పుకొని చూడాల్సిందే. ఆకాశం చూడాలంటే పడుకోని చూడాల్సిందే. మనం విమానం చూడాలంటే శబ్దం వస్తున్న వైపు తలపైకెత్తితే కనిపిస్తుంది. అయితే అక్కడ ప్రజలు విమానం చూడాలంటే పెద్ద హంగామానే చేయాల్సి ఉంటుంది. ముందు మంచం ఏర్పాటు చేసుకోవాలి. ఆ మంచంపై పడుకొని మరొకరితో విమానం వెళ్తున్న దిశలో మంచాన్ని తిప్పించుకుంటూ పోవాలి. అప్పుడే విమానం కనిపిస్తుంది. ఇది తరతరాల సమస్య. ఫలితంగా తరాలకు తరాలే నిర్వీర్యం అయిపోతున్నాయి

భారతదేశంలో ఇటీవల యునిసెఫ్ సర్వే నిర్వహించి వెలువరించిన గణాంక వివరాల ప్రకారం సుమారు ఏడు కోట్ల మంది ప్రజలు ఫ్లోరోసిస్‌తో జీవచ్ఛవాల్లా జీవితాలు గడుపుతున్నారు. అంటే ఈ సంఖ్య మన రాష్ట్ర జనాభాకు సమానం. ఈ గణాంకాలు తలచుకుంటే ఎవరికైనా ఒళ్ళు జలదరించక మానదు. సమస్యను పరిష్కరించడంలో ఇంకా మీనమేషాలు లెక్కిస్తున్న పాలకులపై ఆగ్రహం కలగక మానవు.

ఇది ప్రపంచ వ్యాప్త సమస్య

ఫ్లోరోసిస్ సమస్య ప్రపంచవ్యాప్తంగా ఉంది. 19 దేశాలలో దీని తీవ్రత అధికంగా ఉంది. ఆ దేశాలలో ఇటలీ, అమెరికా, అర్జెంటీనా, చైనా, యూరప్, జపాన్, కెనడా, భారతదేశం, సౌదీఅరేబియా, పర్షియన్ గల్ఫ్ దేశాలున్నాయి. తొలిదశలోనే సమస్యను గుర్తించిన కొన్ని దేశాలు రక్షిత త్రాగునీరు అందించే శాశ్వత పథకాలపై దృష్టి సారించి సమస్యను ఎప్పుడో అధిగమించాయి. భారత్ వంటి కొన్ని దేశాలు ఇంకా ఈ సమస్యతో సతమతమౌతూనే ఉన్నాయి.

భారతదేశంలో...

మనదేశంలో సుమారు 20 రాష్ట్రాలలో ఫ్లోరైడ్ సమస్య ఉంది. ఆ రాష్ట్రాలలో మొదటి స్థానంలో పంజాబ్ ఉంది. దాని ప్రక్క రాష్ట్రమైన హర్యానాలో కూడా సమస్య తీవ్రంగానే ఉంది. పంజాబ్, హర్యానాలలోని కొన్ని ప్రాంతాలలో అత్యధిక స్థాయి ఫ్లోరైడ్ 40 పిపియంల వరకు రికార్డు అయ్యింది. తరువాతి స్థానాలలో ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, ఢిల్లీ రాష్ట్రాలున్నాయి.

మన ప్రభుత్వం, వివిధ సంస్థలు నిర్వహించిన వివిధ సర్వేల ప్రకారం రాష్ట్రంలో ప్రతి జిల్లాలోనూ ఫ్లోరిన్ బాధిత ప్రాంతాలున్నాయి. అయితే అనంతపురం, ప్రకాశం, నల్గొండ, రంగారెడ్డి జిల్లాలల్లో అత్యధిక ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలున్నాయి. తర్వాత స్థానాలలో గుంటూరు, కృష్ణా, కర్నూలు, మహబూబ్‌నగర్, వరంగల్, చిత్తూరు, మెదక్, నిజామాబాద్, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పశ్చిమగోదావరి జిల్లాలున్నాయి.

రాష్ట్రంలో మొత్తం 18 జిల్లాల్లో ఫ్లోరైడ్ తీవ్రత అధికంగా ఉందని సర్వేలు ఏనాడో వెల్లడించాయి. 1993లో "రాజీవ్‌గాంధీ నేషనల్ డ్రింకింగ్ వాటర్ మిషన్" జరిపిన సర్వేలో కూడా అదే తేలింది.

కేవలం గ్రామీణ ప్రాంతాలేకాక నగర, పట్టణ ప్రాంతాలలో కూడా ఫ్లోరైడ్ సమస్య ఉంది. వీటిలో హైదరాబాద్, విశాఖపట్నం, గుంటూరు నగరాలు, ఒంగోలు, కందుకూరు, మార్కాపురం, సత్తెనపల్లి, చిలకలూరిపేట, నరసరావుపేట, మాచర్ల, తదితర పట్టణాలు ఎన్నో ఉన్నాయి. అయితే వీటికి నదీ జలాలను కాలువల ద్వారా, పైపుల ద్వారా సరఫరా చేయడం వల్ల ఇక్కడి భూగర్భజలాలను త్రాగడానికి, వంటకు ఉపయోగించడం లేదు. ఫలితంగా ఫ్లోరోసిస్ సమస్య పరిష్కారమైపోయింది. గ్రామీణ ప్రాంతాలలో నేటికీ ఈ సమస్య అలాగే ఉంది.

ఫ్లోరోసిస్ లక్షణాలు ఎంత కాలానికి బయటపడతాయి?

తొలుత ఫ్లోరిన్ ప్రభావం దంతాలపై కనిపిస్తుంది. దంతాలపై చాక్‌లెట్ వైట్ ఒపాసిటీలు కనిపిస్తాయి. తరువాత గుంటలు ఏర్పడతాయి.

ఈ సంచిక ప్రత్యేక ఫోటో



ముస్లిం కుటుంబం

పసుపుపచ్చ అడ్డచారలుగా మారతాయి. దీనినే "డెంటల్ ఫ్లోరోసిస్" అంటారు. ఈ దంతాలు తర్వాత త్వరగా ఊడిపోతాయి.

ఎముకలు, కీళ్ళు, కండరాలు, టెండాన్‌లు, లిగమెంట్‌లలో ఫ్లోరైడ్ పేరుకుపోతుంది. ఫలితంగా ఎముకల రంగులో మార్పులు వస్తాయి. హెవీగా తయారవుతాయి. పెళుసుదనం వస్తుంది. ఎముకలు - కండరాల అనుసంధాన ప్రదేశాలలోని లిగమెంట్స్‌లో, టెండాన్‌లలో ఫ్లోరైడ్ పేరుకుపోయి కొత్త ఎముకలలాగా రూపొందుతాయి. ఈ కండర నిర్మాణాలు ఎముకల్ని బిగించడం వల్ల ఎముకల్లో వంకరలు మొదలవుతాయి. బిగింపు తీవ్రతను బట్టి కాళ్ళు, చేతులు, చిత్ర, విచిత్ర ఆకారాలలో వంకర్లు పోవడం జరుగుతుంది. వెన్నెముకలోను మార్పులొస్తాయి. వర్టెబ్రాల మధ్య కదలికలను నియంత్రించే ఖాళీ స్థలం ఫ్లోరైడ్ ప్రభావంతో పూడుకుపోతుంది. ఫలితంగా వెన్నెముక వంచడం కష్టమౌతుంది. గూని వస్తుంది. దీని వల్ల వెన్నుపాము (స్పైనల్ కార్డ్) నుండి వెలువడుతున్న నరాల కుదుళ్ళు వత్తిడికి (కంప్రెషన్) గురవుతాయి. దీనినే వైద్యశాస్త్ర పరిభాషలో "రాడిక్యులోమైలోపతి" అంటారు. చివరకు నరాలపై ఒత్తిడి పెరిగిపోయి పక్షవాతం వస్తుంది. ఫలితంగా కాళ్లు, చేతులు చచ్చుబడిపోవడం జరుగుతుంది. ఫ్లోరోసిస్ బాధితుల్లో వెన్నెముకపై అక్కడక్కడ క్రమపద్ధతిలో (వెదురుగడ కణపుల్లాగా) బాంబు స్టిక్‌లా కనిపించే ఉబ్బెత్తులు ఏర్పడుతాయి. అందువల్లనే దీనిని "బాంబు స్పైన్"గా పేర్కొంటుంటారు. ఎముకలకు సోకిన ఈ ఫ్లోరోసిస్‌నే స్కెలిటల్ ఫ్లోరోసిస్ అంటారు.

ఫ్లోరోసిస్ - నిర్ధారణ పరీక్షలు

డెంటల్ ఫ్లోరోసిస్‌ను దంతాలు పరిశీలించడం ద్వారానే సులభంగా నిర్ధారించవచ్చును. అందుకు ప్రత్యేక పరీక్షలు అవసరం లేదు. స్కెలిటల్ ఫ్లోరోసిస్‌ను ఎక్స్‌రేల ద్వారా తొలి దశలోనే గుర్తించవచ్చును. ఇందుకు నేడు అందుబాటులోకి వచ్చిన సి.టి. స్కాన్, ఎం.ఆర్.ఐ. వంటివి కూడా ఉపయోగపడతాయి. అయితే ఆ పరీక్షలు ఖరీదైనవి. మామూలుగా ఆరోగ్యవంతుల ఎముకలలో 200 - 300 పి.పి.యం.ల ఫ్లోరైడ్ ఉంటుంది. ఫ్లోరోసిస్ బాధితులలో 700 - 7000 పి.పి.యం ల వరకు తీవ్రతను బట్టి ఉంటుంది. రక్తంలోను ఫ్లోరైడ్ శాతం పెరుగుతుంది. యూరిన్‌లో అధిక ఫ్లోరైడ్‌ను గుర్తించవచ్చును. సాధారణంగా యూరిన్‌లో 0.4 - 1.0 పి.పి. యం.లు పోతూ ఉంటుంది. ఫ్లోరోసిస్‌కు గురైన వారిలో 2 - 14 పి. పి. యం. ల వరకు ఉంటుంది. ఎముకల అంతర్నిర్మాణంలో కూడా అసాధారణ మార్పులు చోటుచేసుకుంటాయి. ఎముక మజ్జ (బోన్ మారో)లో మార్పులు వచ్చి ఎర్ర రక్త కణాల ఉత్పత్తి తగ్గిపోతుంది. ఫలితంగా హిమోగ్లోబిన్ తగ్గిపోయి రక్తహీనత (ఎనీమియా) వస్తుంది. ఈ రక్తహీనత వల్ల కూడా ఫ్లోరోసిస్ బాధితులు శక్తిహీనులు అవుతారు.

ఫ్లోరోసిస్ - చికిత్స

ఫ్లోరోసిస్‌కు ప్రత్యేక చికిత్స ఏమీ లేదు. ఒక్కసారి శరీరం ఫ్లోరోసిస్‌కు గురయితే ఇక ఆ వ్యక్తులకు చేయగలిగిందేమీ లేదు. కొద్దిపాటి ఉపశమనానికి నొప్పిని చంపే మందులను (పెయిన్ కిల్లర్స్) వాడవచ్చును. వీటిని అధికంగా వాడితే జీర్ణాశయంలో అల్సర్స్ వచ్చే ప్రమాదం ఉంది. ఫిజియోథెరపి కొంత వరకు ఉపయోగపడవచ్చును. ఫ్లోరైడ్ నివాసిత ప్రాంతాల ప్రజలు ఫ్లోరైడ్ టూత్‌పేస్టులను వాడకూడదు. ఆహారంలో క్యాబేజీ, టీ వంటివి తగ్గించడం మంచిది. వక్కపొడి వాడకూడదు. సిగరెట్ తాగకూడదు. ఆహారంలో కాల్షియం గల పదార్థాలు, విటమిన్ సి, విటమిన్ డి గల పదార్థాలు, ప్రొటీన్‌లు, చింతపండు వంటివి ఎక్కువగా తీసుకోవడం ద్వారా ఫ్లోరైడ్ తీవ్రతను కొంతకాలం పోస్ట్‌పోన్ చేయవచ్చును. ఫ్లోరైడ్ నీటిని సేవించడం పూర్తిగా మానేయాలి. ★

దంత సంరక్షణ

క్విజ్-7

నిర్వహణ: డా॥ కె.ఎల్.వి. ప్రసాద్, హన్మకొండ

1. తెల్లగా కన్పించే పంటి భాగాన్ని యిలా పిలుస్తారు.
   అ. పింగాణీపొర　　ఆ. ఎనామిల్‌పొర
   ఇ. డెంటిన్ పొర　　ఈ. సిమ్మెంటమ్ పొర
2. వాడుక భాషలో 'ఎనామిల్'ను ఈ విధంగా పిలుస్తారు.
   అ. తెల్లపొర　　ఆ. పిండిపొర
   ఇ. సిల్వర్‌పొర　　ఈ. పింగాణీపొర
3. పంటి లోపలి భాగాలలో (నిలువుకోత) పింగాణీ పొర తర్వాత భాగాన్ని యిలా పిలుస్తారు.
   అ. సిమ్మెంటమ్　　ఆ. పల్ప్
   ఇ. ఎనామిల్　　ఈ. డెంటిన్
4. పంటి లోపల అతి ముఖ్యమైనవి స్పర్శ వంటి సంకేతాలను అందించే భాగం
   అ. సిమ్మెంటమ్　　ఆ. ఎనామిల్
   ఇ. పల్ప్‌కుహరం　　ఈ. డెంటిన్
5. శరీరంలో అతి గట్టిదైన భాగం పంటి భాగాలలో ఒకటి. అది.
   అ. పంటి పింగాణీపొర　　ఆ. పంటి డెంటిన్‌పొర
   ఇ. పంటి సిమ్మెంటమ్‌పొర　　ఈ. పైనచెప్పినవన్నీ
6. పంటి మూల భాగంలో (రూట్) నరాలను రక్తనాళాలను, దవడ నుండి పల్ప్ కుహరంలోనికి చేర్చే మార్గాన్ని
   అ. రూట్ కెనాల్ అంటారు.　　ఆ. టూల్ కెనాల్ అంటారు
   ఇ. నెర్వ్ కెనాల్ అంటారు　　ఈ. అన్నీ కరెక్ట్.
7. పంటిలోపలి భాగాలలో విరిగిపోయినా, అరిగిపోయినా, కరిగిపోయినా తిరిగి అభివృద్ధి చెందని భాగం
   అ. ఎనామిల్ఆ. డెంటిన్
   ఇ. పల్ప్　　ఈ. సిమ్మెంటమ్
8. పంటిలోని పింగాణీపొర (ఎనామిల్) విరిగిపోయినా రంధ్రం పడినా, నొప్పి తెలియక పోవడానికి కారణం
   అ. గట్టిగా ఉండడంవల్ల　　ఆ. మందంగా ఉండడంవల్ల
   ఇ. నరాలు లేకపోవడంవల్ల　　ఈ. అన్నీ తప్పే
9. ఈ పంటిపొరకు ఆమ్లాలలో (ఆసిడ్స్) కరిగి పోయే గుణం ఉంది.
   అ. ఎనామిల్‌పొర　　ఆ. పెరియోడెంటల్‌పొర
   ఇ. డెంటిన్‌పొర　　ఈ. సిమ్మెంటమ్‌పొర
10. పంటి ఉపయోగాలు
   అ. ఆహారం నమలడం (మేస్టికేషన్)
   ఆ. అందం (ఈస్థటిక్స్)
   ఇ. స్వచ్ఛమైన పద ఉచ్ఛారణ (ఫోనేషన్)
   ఈ. అన్నీ కరక్ట్

జవాబులు: 1. ఆ ఎనామిల్ 2. ఈ 3. ఈ 4. ఇ 5. అ 6. అ 7. అ 8. ఇ 9. అ 10. ఈ

పుస్తక పరిచయం

గ్రామీణ కుటుంబ కథలు



"మట్టి వాసనలు" (కథలు)
పంజాల జగన్నాథం,
పంజాల పబ్లికేషన్స్,
కరీంనగర్, వెల: 60రూ.
పేజీలు 120.
ప్రతులకు: నవోదయ మరియు అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో

ఇవి అసలుసిసలైన గ్రామీణ జీవితాన్ని చిత్రీకరించిన కథలు. అభివృద్ధికి ఆమడదూరంలో వున్న తెలంగాణా గ్రామాల కథలివి. సరియైన నీటిపారుదల వసతులు లేక కేవలం వర్షాధారమైన వ్యవసాయం. దానికి తోడు కల్తీ విత్తనాలు, కల్తీ మందులతో వ్యాపారుల ధనదాహానికి రైతులు బలయిపోతున్నారు. ఇంకోవైపు వ్యవసాయంలోకి యంత్రాలు ప్రవేశించడంతో వ్యవసాయరంగంపై ఆధారపడిన పనివాళ్ళు, వృత్తి పనివాళ్ళు నిరుద్యోగులుగా మారక తప్పలేదు. సన్నకారు రైతులు కూడా కూలీవాళ్ళుగా మారక తప్పని పరిస్థితి. అక్కడ కూడా సరిగా పనులు ఉండవు. పనికి సరిపడా కూలీ ఇవ్వరు. రాళ్ళు కొట్టడానికో, బండలు కొట్టడానికోపోతే తక్కువ కూలీ ఇచ్చి ఎక్కువపని చేయించుకుంటారు. వాళ్ళు అక్కడ నుంచి పారిపోకుండా కాలికి గొలుసులు వేసి పనిచేయించుకునే నిరంకుశ క్వారీ యజమానులు. ఇలాంటి క్వారీ, గ్రానైట్ యజమానులు హింసల్లోంచి, బయటినుండి ఎవరోవచ్చి రక్షిస్తారనీ, తమ బ్రతుకులు బాగు చేస్తారని ఎదురుచూడటం, ఊళ్ళల్లో పనులు లేక దిగాలు పడుతుంటే ఎంతో కష్టపడి చదివించిన తమ కొడుకులు కూడా నిరుద్యోగులుగా తిరిగివచ్చి ఊరకే తమ కళ్ళముందు తిరుగుతుంటే వాళ్ళ మనసులు ఎలా తల్లడిల్లిపోతాయో వివరించలేము. ఇలా అస్తవ్యస్తమైన గ్రామీణ జీవితాన్ని కోల్పుతున్న ఆ మట్టి వాసనలను ఈ కథలు అత్యంత చాకచక్యంగా తెలియజేస్తాయి.

ఇంత నిరాశామయమైన జీవితాన్ని గడుపుతున్న గ్రామస్తుల జీవితాలలో దొరల, పటేండ్ల పెత్తందార్ల దోపిడీ, దౌర్జన్యాలకు అంతులేదు. ఆర్థికంగా, లైంగికంగా ప్రజలను దోపిడి చేసే నిరంకుశత్వమే రాజ్యంగా చలామణి అవుతున్న ఊరి పెత్తందారుల్ని, ఇక మీ రోజులు చెల్లవంటూ కొంత చైతన్యాన్ని ప్రదర్శించే పాత్రలతో కొన్ని కథలు నిండి వున్నాయి.

ఇందులో ఎక్కువభాగం కథలో విచ్ఛిన్నమైపోతున్న కుటుంబ సంబంధాలను వివరిస్తారు. తండ్రి ఎంతో కష్టపడి పిల్లల్ని చదివించి, పెళ్ళిచేసి తమను ఆదుకుంటాడని భావిస్తే పిల్లలంతా తమ స్వార్థంతో తల్లిదండ్రులను మరిచిపోవడం, వాళ్ళను నిర్లక్ష్యంచేసి బాధించడం కనిపిస్తుంది. మంచి స్థితికి చేరిన పెద్దకొడుకులు తమ ఇంటి బాధ్యతలను మరిచిపోయి తమ్ముళ్ళ చదువులు, చెల్లెళ్ళ పెండ్లిండ్లను కూడా పట్టించుకోరు. చాలా వరకు ఇలాంటి కథల్లో పెద్ద కొడుకుల స్వార్థం కనిపిస్తుండగా, దాదాపుగా తండ్రులంతా టీచర్లుగా కనిపిస్తారు.

జీవితపు లోతుల్లోంచి వచ్చిన ఈ కథలన్నీ సహజంగా వుండి మనల్ని ఆకట్టుకుంటాయి. ఆకలి, దారిద్ర్యం ఎంత భయంకరంగా వుంటాయో ఈ కథలు వివరిస్తాయి. వాటితోపాటు లుప్తమైపోతున్న కుటుంబ సంబంధాలను, మానవ సంబంధాలను తల్చుకుని తల్లడిల్లే రచయిత ఆవేదనను ఈ కథలు ప్రతిబింబింపజేస్తాయి. వీటికి భిన్నంగా ఏదో ఒక సందేశాన్ని ఇవ్వడం కోసం రాసిన "అంతర్వేదన, సంఘర్షణ, ఆత్మఘోష" లాంటి కథలు తేలిపోతాయి. ఈ కథలన్నిటిలో అచ్చమైన గ్రామీణ వాతావరణముంది. ఆ గ్రామీణ జీవితం, వారి ఆచార వ్యవహారాలు, వారి విందులు-విలాసాలు ఇలా అన్నింటిని సహజంగా చిత్రీకరించడంలో రచయిత చూపిన నేర్పు ప్రశంసనీయం.

కె.పి. అశోక్‌కుమార్

కుటుంబ "తగవు" తీర్చినే తీర్పులు

భర్తను కోల్పోయి పిల్లలు లేక ఒంటరిగా కాలం వెళ్ళతీసే లక్ష్మికి సంక్రమించిన అత్తగారి ఆస్తిని కాజేయడానికి బంధువుల పన్నాగం. విధవరాలిగా పుట్టింటికి తిరిగివచ్చిన చెల్లెలికి పిత్రార్జితం నుండి భరణం ఇవ్వడానికి నిరాకరించే అన్నయ్య. భార్య ఇష్టాఇష్టాలను పట్టించుకోకుండా తనకు నచ్చిన పిల్లవాడ్ని దత్తత చేసుకుంటే అది చెల్లదని గద్దించిన భర్త. తల్లి నుండి సంక్రమించిన స్త్రీ ధనాన్ని కూతురికి దక్కకుండా చేయడానికి ప్రయత్నించే తండ్రి. వరకట్నాన్ని డిమాండ్ చేసి పీడించే వ్యక్తులు. విదేశాలలో వుండి విడాకులు పంపించే భర్త. ఉద్యోగినులపై కొనసాగే లైంగిక వేధింపులు. అత్యాచారం కేసును నీరుగార్చు ప్రయత్నాలు. ఇలా ఎన్నో సమస్యలలో చిక్కుకున్న స్త్రీలకు తాము ఏం చేయాలో తోచదు. వారికి న్యాయం ఎలా జరుగుతుందనేది ప్రధాన సమస్య. సమస్యలలో చిక్కుకున్నవారికి సరియైన న్యాయ సలహాలు ఇవ్వడం వల్ల కొండంత ధైర్యాన్ని, తగిన న్యాయాన్ని, ఒక కొత్త జీవితాన్ని ఇవ్వగలుగుతామని గుర్తించిన రచయిత తన న్యాయ పరిజ్ఞానాన్ని ఉపయోగించి, సంవాద రూపంలో నాటికీకరించి అందజేస్తున్న అమూల్య సమాచారమే ఈ నాటికాసంపుటిగా రూపుదాల్చింది.

"తగవు"ల నుండి బయటపడేలా చేసే ఈ లీగల్ నాటికలు మహిళలలో న్యాయపరమైన రక్షణా హక్కులను తెలియజేయడంతోపాటు, వారికి సరియైన న్యాయం జరిగే దిశగా చైతన్యపరుస్తాయి. ఈ నాటికల రచనా విధానం శ్రవ్య నాటికలకు అనువైంది. కాబట్టే ఇవి రేడియో నాటికలుగా విజయవంతం కాగలిగాయి. సమస్యలను వివరించడంలో రచయిత చూపిన నాటకీకరణలోని బిగువు, చివరిదాకా నడిపించడంలో చూపిన ఉత్కంఠ, సస్పెన్స్ విడిపోయేలా చేసే జడ్జిమెంట్ ఇలా అన్నీ కలసి పాఠకుడ్ని సంభ్రమాశ్చర్యంలో ముంచెత్తుతాయి. అవే ఈ నాటికల గొప్పతనం. ఈ నాటికలను ఆకాశవాణిలో మళ్ళీ మళ్ళీ ప్రసారం చేయడంవల్ల మహిళా చైతన్యానికి దోహదపడగలుగుతారు. విద్యాసంస్థలు, మహిళా సంఘాలవారు కూడా ఈ నాటికలను దృశ్యనాటికలుగా ప్రదర్శించుకోవడానికి ఇవి అనువుగా ఉండడం విశేషం.

"తగవు" ఇతర లీగల్ నాటికలు
మంగారి రాజేందర్ జింబో,
ప్రోజ్ పొపెట్రా ఫోరమ్,
హైదరాబాద్, వేములవాడ,
వెల: రూ.30 పేజీలు: 48
అన్ని ముఖ్య పుస్తక కేంద్రాలలో లభించును.

ఈ సంచిక ప్రత్యేక ఫోటో

ఆఫ్రికా ఖండపు గిరిజన కుటుంబం

నిశ్చలన శబ్దచిత్రం

చూరువంగిన ఆ ఇంటి వాకిల్లో
చెదలు పట్టిన బ్లాక్ అండ్ వైట్ ఫొటో!
అదిగో ఆ పంచకట్టు కండువా శాల్తీ.
ఈ చిత్రానికి రంగులు నింపాలని
భుజాలు కమిలేలా ఈ సంసార పల్లకీ మోసిందతనే
పటంలోని, అతని చుట్టూ నిలబడ్డ
సగం పంట్లాముల వారికీ
పట్టు పరికిణీలవారికీ మధ్య
నిస్తంత్రీ ప్రసారపు నెట్‌వర్క్ సర్వర్,
అతనిప్పుడు బ్రతికిలేడు
అతను కళ్లు తెరిచింది కన్నుమూసేముందే!
అప్పుడతనన్నమాట ప్రస్తావించుకుందాం!
"బిడ్డలారా! మమ్మల్ని మరువకండి
మీ సౌందర్యజీవితాలకి మచ్చలమే అయినా
పుట్టు మచ్చలుగా ఐడెంటిటీకైనా పనికొస్తాం"
ఫొటోలో ఫ్రీజ్ అయిన మరోమనిషి
ఆమె గురించి చెప్పను
ఆమె దాచుకున్న అలల తరంగ ధైర్యం
ఆమె ఎవరితోనూ పంచుకోలేదు.
వసుధైక కుటుంబం ఏర్పడినప్పుడు
ఆమె 'సుధ'ను కావాలనుకోలేదు
ఆకాశంలో సగం మాటటుంచి
ఆవగింజ కూడా కాదల్చుకోలేదామె
ఆమె దాచుకున్న నాల్గు క్షణాక్షతల్ని
పోపుల డబ్బాలోనే మర్చిపోయింది
ఆమెను చరిత్ర తొక్కి పెట్టగా
కుటుంబ న్యాయం అన్యాయం చేసింది.
పటంలోని మిగిలిన పాత్రలే చేతనమైనవి
కొన్ని జతలకాళ్ళు మరిన్ని జతల చేతులు

డాలర్ల కళ్ళు, రెక్కలుగా మారిన గుండెలో
ప్రపంచీకరణ ప్రక్రియలో
విడివిడిగా విసర బడ్డ మాంసఖండాలు

పటంలోని చిత్రాన్ని ఆక్రమించదానికి
చూరువంగిపోతూండగా,
పటం వెనుక చేరిన బల్లి
పారిపోవడానికి సిద్ధంగా ఉంది
రేపటి ఇల్లు... పటాన్ని మింగి, ఒళ్ళు పెంచి అగ్గిపెట్టె గదుల్లో
ఆకాశ హర్మ్యం కానుంది
ఒక్కొక్క గదిలో ఒక్కొక్క గుడ్డుని
గ్లోబల్ రాక్షసి పొదిగి
మరిన్ని విస్ఫోటనాలను అందించబోతోంది!

-బుర్రా సాయిబాబు

ఈ సంచిక ప్రత్యేక ఫొటో

భారత కుటుంబం



"సంసారం" నుంచి "సంక్రాంతి" దాకా...

సినిమాల్లో కుటుంబం

పి. పి

1950 నాటి మాట. "సంసారం" విడుదలై ఘనవిజయం సాధించింది. సాంఘిక చిత్రాలలో తొలి సూపర్ హిట్ అనదగిన ఆ సినిమా దర్శకుడు ఎల్.వి.ప్రసాద్ కాగా ఎన్టీఆర్, ఏఎన్నార్ ఇద్దరూ నటించారు. అన్నదమ్ముల మధ్య అపార్థాలు వచ్చి విడిపోవడం చిత్ర కథాంశం. కాలం మారే కొద్ది ఉమ్మడి కుటుంబాలు నిలబడటం కష్టమని సూచించిన మొదటి సినిమా.

2005లో ఇప్పుడు సంక్రాంతి అనే సినిమా ఒకమోస్తరు విజయం సాధించింది. వెంకటేష్ హీరోగా నటించిన ఈ చిత్రం ఉమ్మడి కుటుంబాలు వుండాలని చెబుతుంది. యాభై అయిదేళ్ల తర్వాత మరోసారి ఈ విధమైన సినిమా రావడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? వెంకటేష్ తోనే ఇంతకు ముందు 'కలిసుందాం రా' అన్న చిత్రం ఘన విజయం సాధించింది. ఈ యాభైఏళ్లలో సినిమాల తీరు తెన్నులు ఒకసారి పరిశీలిస్తే అది సమాజ స్పందనను వెల్లడిస్తుంది.

సాధారణంగా మన సినిమాలన్నిటినీ కుటుంబ సమేతంగా చూడదగిందని ప్రచారం చేస్తుంటారు. మాస్‌సినిమాలు, క్లాస్ సినిమాలు, ఫ్యామిలీ సినిమాలు, కామెడీ సినిమాలు ఇలా విభజనలు చేశారు. కమర్షియల్ మసాలాలాగే కుటుంబ సెంటిమెంట్లు కూడా బాగా పండుతాయని, లాభాలు పండిస్తాయని మన దర్శక నిర్మాతలు నమ్మకం.

అక్షరాలా "ఉమ్మడి కుటుంబం"(1967) పేరుతోనే ఎన్‌టిఆర్ తీసిన చిత్రం ఘన విజయం సాధించింది. వాస్తవానికి అది కేవలం ఆ ఒక్క అంశానికే పరిమితమైన కథ కాదు. రామారావు యముడుగా నటించిన అంతర్నాటకం, ఆ కుటుంబానికి ఏ సంబంధం లేని నాయిక కృష్ణకుమారి పాత్ర ప్రాధాన్యత చాలా వుంటుంది. మ్యూజికల్ హిట్ కూడా. కుటుంబంలో వ్యవసాయం చేసే వారికి, విద్యాధికులైన వారికి మధ్య వైరుధ్యాలు ప్రధానాంశం. 'చెప్పుడు మాటలు వింటే ఆ చెవులకు చేటు- అడ్డు గోడలే వుంటే ఆ ఇంటికి చేటు' అంటూ అందరూ కలసి వుండాలని చెప్పే సందేశంతో ముగుస్తుంది.

తర్వాత రెండేళ్లకు 1969లో అక్కినేని నాగేశ్వరరావు సినీ జీవిత రజతోత్సవ చిత్రంగా వచ్చింది 'ఆదర్శ కుటుంబం'. ప్రసిద్ధ నిర్మాణ సంస్థ ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ వారి ఆ చిత్రం కలతలతో కలసి వుండేకంటే విడిపోయి అభిమానాలు నిలుపుకోవడం మంచిదని చెబుతుంది. పాటలు, కామెడీ అన్నీ బావున్నా అది అనుకున్న విజయం సాధించలేదు. మరో పదిహేనేళ్ల తర్వాత దాసరి నారాయణ రావు దర్శకత్వంలో అక్కినేని-జయసుధ జంటగా యువ హీరోలతో 'బంగారు కుటుంబం' అన్న చిత్రాన్ని నటుడు సత్యనారాయణ నిర్మించారు. ఇది కూడా ఆదర్శ కుటుంబం సందేశాన్ని చెప్పేదే. ఈ చిత్రం అభినందన సభలో అక్కినేని మాట్లాడుతూ తాను పట్టుపట్టి తీయించిన ఆదర్శకుటుంబం అప్పట్లో విజయం సాధించకపోవడానికి కారణం అప్పటికి ఆ భావాన్ని అందుకునే స్థితి రాకపోవడమేనని చెప్పారు. తమిళ దర్శకుడు విసు 'సంసారం ఒక చదరంగం' రీ మేక్ చిత్రంలోనూ మారుతున్న కాలంలో అందరూ ఒకే ఇంట్లో కడవరకూ కలసి బతకాలనుకోవడం వాస్తవికం కాదనే సందేశాన్ని చెప్పి ఘన విజయం సాధించారు.

ఈ మధ్య కాలంలో చాలా చిత్రాలు కుటుంబ సంబంధమైన అంశాలనే తీసుకుని విజయాలు సాధించాయి. సంసారం, కాపురం, లేదా కుటుంబం అన్న మాటతో టైటిల్స్ పెట్టడం ఒకప్పుడు రివాజుగా వుండేది. ఆ విధంగా నిండు సంసారం, నిండు కుటుంబం, పండంటి కాపురం, బంగారు కుటుంబం, మంచికుటుంబం, విచిత్ర కుటుంబం, వింత సంసారం, రైతు కుటుంబం, కలవారి కుటుంబం, వగైరా చాలా చాలా వచ్చాయి. ఈ పేర్లలోనే వాటి కథాగమనం తెలుస్తుంది. ఇందులో కొన్ని అచ్చంగా కుటుంబ సమస్యలపైనే కాకున్నా అనుబంధాల చిత్రణే అన్నిట్లో ప్రధానం. అన్ని తరాల, తరహాల నటులూ ఈ చిత్రాల్లో రాణించారు. అదొక దశ.

1990 వ దశకంలో ఇంకో తరహా చిత్రాలు వచ్చాయి. అవి గ్రామీణ నేపథ్యంలో గ్రామపెద్ద కుటుంబ పెద్ద కూడా అయిన హీరో కేంద్ర బిందువుగా తయారైనవి. బొబ్బిలి బ్రహ్మన్న, పెదరాయుడు వంటివి ఈ కోవకు చెందినవే. వీటిలో గతించిన కాలపు చిహ్నాలను గొప్పగా చూపించడం చూస్తాం. ప్రేక్షకులు వాటికి బ్రహ్మరథం పట్టడంతో అనేక అనుకరణలు వచ్చాయి. మరో వైపున ఈ కాలంలోనే సంపన్న కుటుంబాలలో సంతోష సరాగాలను చూపే భారీ కుటుంబ చిత్రాలు - నిన్నే పెళ్లాడుతా, పెళ్లిసందడి వంటివి వచ్చాయి. మారుతున్న కాలానికి తగిన సంపన్న నేపథ్యంతో సమస్యల ప్రస్తావన లేకుండా సరదాగా

ఈ సంచిక ప్రత్యేక ఫోటో



రష్యన్ కుటుంబం

సాగిపోయే ఈ చిత్రాలు ఒక తరహా పలాయనవాదాన్ని ప్రతిబింబిస్తాయని విశ్లేషకులు భావించారు. అయితే అవి అనారోగ్యధోరణులు లేకుండా రూపొందడం కూడా వాటి విజయానికి దోహదపడి వుండొచ్చు.

ఇక 2000 సంవత్సరం ప్రారంభంలోనే 'కలిసుందాం రా' విడుదలై విజయం సాధించింది. దీంట్లో వెంకటేష్ నాయకుడు. ఇది ఉమ్మడి కుటుంబ సందేశాన్ని అందించే సినిమానే. అయితే టైటిల్ కాలానుగుణంగా మార్చేశారు. కథలో అనేక సెంటిమెంట్లు కూడా వున్నాయి. మ్యూజికల్ హిట్ కూడా. అయితే మార్కెట్ శక్తుల ధాటికి మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయనే ఆవేదన జనంలో చోటు చేసుకోవడం ఈ చిత్ర విజయానికి దోహదం చేసిందని నిస్సందేహంగా చెప్పొచ్చు. అప్పటికే పెరిగిన ఫ్యాక్షన్ చిత్రాలు, టీనేజి ప్రేమ చిత్రాల మధ్య ఇది పెద్ద రిలీఫ్‌గా కనిపించింది. వాస్తవానికి దాంట్లో అవి కూడా లేకపోలేదు. నిజానికి ఏ తరహా చిత్రం తీసినా ఇప్పుడు కుటుంబ సంబంధాలను, అంతకు మించి స్నేహబంధాలను బలంగా చూపడం జరుగుతున్నది. మామ్మలు, తాతయ్యలు, బాబాయిల వంటి పాత్రలకు చాలా ప్రాధాన్యత లభిస్తోంది. నిజ జీవితంలో ఆ అనుబంధాలు కొరవడ్డాయనుకుంటున్న స్థితిలో తెరపై వాటికి ఆదరణ పెరగడం ఆసక్తికరమైన విషయం. అప్పటికి ఇప్పటికి కూడా కుటుంబాలలో స్త్రీ పాత్రల చిత్రణలో మాత్రం మన సినిమాలు పెద్ద ముందంజ వేయలేదని చెప్పొచ్చు. వారిని అందాలబొమ్మలుగా లేదా ఆవేదనా మూర్తులుగా తప్ప రక్తమాంసాలుగల సజీవ మూర్తులుగా చూపే సినిమాలు చాలా తక్కువే.

ఉమ్మడి కుటుంబ సందేశాలిచ్చే సినిమాలన్నిటిలో ఇంటి పెద్దన్న మాట వేదవాక్యంగా చూపుతుంటారు. ఆయన త్యాగధనుడుగా వుంటాడు. అలాటి ధోరణిని తొలిసారి ప్రశ్నించిన "సంసారం" నుంచి తిరిగి "సంక్రాంతి" వరకూ సాగిన ప్రయాణమిది. ఇందులోనూ హీరో తన త్యాగాలతో కుటుంబాన్ని నిలబెట్టడం చూస్తాం. మారుతున్న పరిస్థితులలో అందరూ కలసి ఒక చోట వుండటం వాస్తవంగా సాధ్యం కావడం లేదు కనక దాన్ని తెరపై చూడటం ఒక విధమైన కాల్పనికతే. 60,70 దశకాలలో ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం ఇంకా పూర్తికాకముందు వచ్చిన సినిమాలకు- ఇప్పుడు ఆ క్రమం దాదాపు పూర్తయినాక వచ్చే సినిమాలకు మధ్య తేడాను స్పష్టంగా చూడొచ్చు. అలాగే వాటిలోని గ్రామీణ వాతావరణం ఇప్పుడు అస్సలు లేకుండాపోవడమూ చూడొచ్చు. వ్యాపార ప్రధానమైనప్పటికీ సినిమా తన కాలానికి సంబంధం లేకుండా వుండలేదు.

అదీ సినిమా కుటుంబ గాథ. ★

ఇది మా ఊరేనా...!



వేషధారణలేకాదు
సంభాషణలూ సంబోధనలూ
కొత్త కొత్తగా మారిపోయాయి...!
అప్పట్లో
ఊరికరణాన్నో మునసబునో
పాఠాలు చెప్పే పంతులుగారినో
"అండీ"... "గారూ"... అని పిలిచేవాళ్ళం
కులమూ మతమూ ఏదైనా
కూలోళ్ళయినా
పిలుపు గుండె గొంతులోంచి వెల్లువై
ఆప్యాయతై అల్లుకుపోయేది
వయసుని బట్టీ వరసబట్టీ
అన్న అనో తమ్ముడనో అత్త అనో మామ అనో
పిన్నీ బాబాయనో
పలకరింపుల పల్లవులతో
మనసుల మధ్య మమతల వంతెన నిర్మించి
ప్రేమతో పలకరించే వాళ్ళం
ఒకరి పొలంలో ఒకరు
చేయీ చేయీ కలిపి పని చేస్తుంటే
సహకార సూత్రం పుట్టింది ఈ పొలాల
నుంచేనేమోననిపించేది

మంచీ చెడూ కష్టమూ సుఖమూ
ఒకరికొకరు పంచుకునే వేదికైన వీధి అరుగు
మమకారపు పందిరిగా మారిపోయేది
ఇప్పుడు చూస్తే...
బడి పిల్లల మాటలు
గణతంత్రానికి బదులు 'వాలంటైన్స్‌డే' గురించే!
పాలు దొరుకుతాయో లేదోగాని
ఊరినిండా పెప్సీలు కోలాలు కొల్లలు
గ్రామ మెదడును
బుల్లితెర దురాక్రమణ చేసి
బూజుపట్టించిన దృశ్యం కొండంతలై కన్పిస్తోంది
కుర్రకారు మాటలు సైబర్ కోటలు దాటి
సెల్‌ఫోన్‌లూ ఇంటర్నెట్‌కేఫ్‌లూ
పిజ్జాలు పబ్‌ల వైపు కళ్ళెం తెంచుకున్న గుర్రాలై విహరిస్తున్నాయి
"హాయ్", "హలో" పిలుపులు వింటుంటే
ప్రపంచం ఓ కుగ్రామం అయిందో లేదోగాని
ఆత్మీయతలు మాత్రం ఆమడ దూరం జరిగాయనిపిస్తోంది
ఏ గాడ్పులకు "బలై"ందో గాని
ఇది మా ఊరేనా అనే సందేహం
నా మెదడును తొలుస్తూనే వుంది

-సోమేపల్లి వెంకట సుబ్బయ్య



ఈ సంచిక ప్రత్యేక ఫొటో

ఆఫ్రో అమెరికన్ కుటుంబం

దత్తత

ADVOCATE

మంగారి రాజేందర్ జింబో

(పాత్రలు: జడ్జి, లాయర్ రజని, లాయర్ కవి, సుజాత, ప్రతాప్)

ప్రతాప్: సుజాత, సుజాత! ఎక్కడికెళ్తున్నావు?

సుజాత: ఒక గంటలో వచ్చేస్తాను

ప్రతాప్: ఆ డాక్టర్ దగ్గరికేనా?

సుజాత: అవునండి

ప్రతాప్: ఎందుకే వృధా ప్రయాస.

సుజాత: ప్రయత్నం చేస్తే తప్పేమిటి?

ప్రతాప్: అన్ని ప్రయత్నాలు అయిపోయాయి కదా! నీ పిచ్చిగాని పదిహేను సంవత్సరాలుగా పుట్టని పిల్లలు ఇపుడు పుడతారన్న నమ్మకమేమిటి?

సుజాత: పెళ్ళయిన ఇరవై సంవత్సరాలకి కూడా పిల్లలు పుట్టిన వాళ్ళున్నారు.

ప్రతాప్: ఇక ఈ ప్రయత్నాలు మానేసి ఎవరినైనా దత్తత తీసుకుంటే మంచిది.

సుజాత: ఎవరినైనా దత్తత తీసుకుందామని మీకు ఇదివరకే నేను చెప్పాను మీరే పట్టించుకోలేదు.

ప్రతాప్: నిజమే! నేను పట్టించుకోలేదు. ఇప్పుడు పట్టించుకుంటూనన్నానుగా.

సుజాత: ఊ! చెప్పండి ఎవరిని దత్తత తీసుకుందాం?

ప్రతాప్: మా చెల్లెలి కొడుకుని దత్తత తీసుకుందామనుకుంటున్నాను.

సుజాత: మీ చెల్లెలి కొడుకునా?

ప్రతాప్: అవును ఏం?

సుజాత: మీరు ఇంకెవ్వరిని దత్తత తీసుకున్నా ఫర్వాలేదు. కానీ మీ చెల్లెలి కొడుకుని మాత్రం దత్తత తీసుకోవడానికి వీల్లేదు. ఆమె నన్ను చాలా కష్టపెట్టింది.

ప్రతాప్: ఎప్పటిసంగతులో గుర్తుపెట్టుకొని ఇప్పుడిలా మూర్ఖంగా ప్రవర్తించడం సరైందికాదు.

సుజాత: నేనేమీ మూర్ఖంగా ప్రవర్తించడం లేదు. మీరొక విషయాన్ని గమనించడం లేదు. ఆ దత్తత తీసుకున్న పిల్లాడి మీద నాకు స్వతంత్రం ఉండదు. ఆమె ఎలాంటి స్వతంత్రం ఇవ్వదు కూడా.

ప్రతాప్: అదంతా నీ భయం మాత్రమే.

సుజాత: నన్ను అర్థం చేసుకునే ప్రయత్నం చేయండి. నేనో మాట చెప్తాను వినండి.

ప్రతాప్: ఊ! చెప్పు.

సుజాత: మనం ఓ అనాధని పెంచుకుందాం. ఆ అనాధకి ఓ మంచి జీవితం ఇచ్చినవాళ్ళం అవుతాం. మనకు ఆ బిడ్డ ఓ వెలుగు ఇచ్చినట్లు అవుతుంది. అంతేకాదు, ఆ బిడ్డ మీద ఎవరి ఆధిపత్యం ఉండదు కూడా.

ప్రతాప్: అనాధనా?

సుజాత: అవును తప్పేముంది?

ప్రతాప్: ఇంత బతుకు బతికి ఓ అనాధను దత్తత తీసుకోవడమా? అయినా నేను మా చెల్లెలికి మాటిచ్చేసాను.

సుజాత: అంటే నన్ను సంప్రదించకుండానేనా?

ప్రతాప్: నీకు అభ్యంతరం ఉండదనుకున్నాను.

సుజాత: మీ చెల్లెలి ఆధిపత్యాన్ని నేను భరించలేను. నా మాట వినండి. మనం ఓ అనాధనే దత్తత తీసుకుందాం.

ప్రతాప్: అది కుదరదు, దత్తత స్వీకారానికి ముహూర్తం కూడా పెట్టించాను.

సుజాత: మీరేమైనా పెట్టించండి. మీ చెల్లెలి కొడుకుని మాత్రం దత్తత తీసుకోవడానికి వీల్లేదు.

ప్రతాప్: అంతేనంటావా?

సుజాత: అంతే!

✿ ✿ ✿

జడ్జి: ఆర్డర్, ఆర్డర్, మీ వాదనలను చెప్పండి లాయర్ రజని.

లాయర్‌రజని: యస్‌యువరానర్! సుజాత, ప్రతాప్‌లు భార్యాభర్తలు, వారిద్దరి వివాహం పదహారు సంవత్సరాల క్రితం జరిగింది. కానీ వాళ్ళకు పిల్లలు పుట్టలేదు. వైద్య పరీక్షలు చేయించుకొన్నారు. మందులుకూడా వాడారు. కానీ ఫలితం లేకుండా పోయింది. ఎవరినైనా దత్తత తీసుకుందామన్న ప్రస్తావన వచ్చింది. తన చెల్లెలి కొడుకుని దత్తత తీసుకుందామని ప్రతాప్, ఎవరినైనా అనాధని దత్తత తీసుకుందామని సుజాత అనుకున్నారు. సుజాత ఇష్టానికి వ్యతిరేకంగా ఆమె అనుమతి లేకుండా ప్రతాప్ తన చెల్లెలి కొడుకుని దత్తత తీసుకున్నాడు. ఆ దత్తతని రిజిస్ట్రేషన్‌కూడా చేయించాడు. అయితే ఆ దత్తతకి సుజాత సమ్మతిలేదు కాబట్టి ఎలాంటి విలువాలేదు.

లాయర్‌రవి: నో యువరానర్, ఆ దత్తతకి సుజాత సమ్మతి ఉంది.

జడ్జి: కాస్త ఓపిక పట్టండి లాయర్ రవీ! మీ వంతు వచ్చినప్పుడు మీ వాదనలు చెప్పండి. ఆ మీ వాదనని కొనసాగించండి లాయర్ రజని.

లాయర్‌రజని: ఎస్ యువరానర్. ఆ దత్తత స్వీకారోత్సవంలో సుజాత పాల్గొనలేదు. హిందూ దత్తత మరియు మనోవర్తి చట్టం 1956లోని సెక్షన్ 7 ప్రకారం స్థిరచిత్తం కలిగి మైనర్ కాని హిందూ పురుషుడు కుమార్తెనుగాని, కుమారున్నిగాని దత్తత తీసుకోవచ్చు. భార్య బతికి ఉన్నట్లయితే ఆమె అనుమతి లేకుండా దత్తత తీసుకోవడానికి వీల్లేదు. అయితే ఆ భార్య సర్వసంగ పరిత్యాగం చేసినపుడు హిందూమతాన్ని విడనాడినపుడు లేదా ఆమె మతిస్థిమితం కోల్పోయిందని అధికార పరిధిగల కోర్టు ధృవీకరించినపుడు మాత్రమే ఆ భార్య సమ్మతి అవసరం లేదు. సుజాత ప్రతాప్‌ల కేసులో దత్తత స్వీకారానికి సుజాత సమ్మతి ఇవ్వలేదు. అందుకని ఆ దత్తతకి ఎలాంటి విలువా లేదు. ఆ దత్తత స్వీకార రిజిస్ట్రేషన్ చెల్లదని కోర్టు ప్రకటించాలని కోర్టు వారిని ప్రార్థిస్తున్నాను. దట్సాల్ యువరానర్.

జడ్జి: యస్, ఇప్పుడు మీ వాదనలు చెప్పండి లాయర్ రవి.

లాయర్‌రవి: యువరానర్ ప్రతాప్ తన చెల్లెలి కొడుకుని దత్తత తీసుకోవడానికి సుజాత తన సమ్మతిని బహిర్గతం చేయలేదు. కానీ ప్రతాప్ దత్తత తీసుకునే రోజు ఆమె తన భర్త ఇంట్లోనే వుంది. అందుకని ఆమె తన చర్యలద్వారా దత్తతకి సమ్మతిని తెలియజేసిందనే అనుకోవాల్సి ఉంటుంది. అంతేకాదు యువరానర్, హిందూ దత్తత మరియు మనోవర్తి చట్టం 1956లోని 16వ సెక్షన్ ప్రకారం దత్తత స్వీకారపత్రం రిజిస్ట్రేషన్ అయినపుడు మరో రకంగా రుజువు కానంతవరకు ఆ దత్తత స్వీకారం చట్టంలో చెప్పిన ప్రకారమే జరిగినట్లుగా కోర్టువారు భావించాల్సి వుంటుంది యువరానర్. అందుకని ఈ కేసులో దత్తత స్వీకార పత్రం రిజిస్ట్రేషన్ అయింది కనుక దాన్ని రద్దు చేయడానికి వీల్లేదు. అందుకని సుజాత వేసిన దావాని డిస్‌మిస్ చేయాలని కోర్టు వారిని ప్రార్థిస్తున్నాను. దట్సాల్ యువరానర్.

జడ్జి: ఇంకేమయినా మీ వాదనలున్నాయి రజని గారూ?

లాయర్‌రజని: యువరానర్ దత్తత స్వీకారం రోజు సుజాత ఇంట్లో ఉన్న విషయం వాస్తవమే కాని ఆ దత్తత స్వీకారాన్ని వ్యతిరేకించి ఆమె అప్పుడే తన పుట్టింటికి వెళ్ళిపోయింది. రికార్డులో వున్న సాక్ష్యాలను పరిశీలిస్తే ఈ విషయం అర్థమౌతుంది యువరానర్. ఈ విషయాన్ని చెప్పకుండా తన వాదనని మాత్రమే చెప్పారు లాయర్ రవి. అంతేకాదు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లపైన సుజాత సంతకం కూడా లేదు. కాబట్టి ఆ డాక్యుమెంటుకి ఎలాంటి విలువా లేదు. అందుకని సుజాత వేసిన దావాని డిక్రీ చేయమని కోర్టువారిని ప్రార్థిస్తున్నాను.

జడ్జి: కేసులోని సాక్ష్యాలను పరిశీలించి వాదోపవాదాలని పరిగణనలోకి తీసుకుని కోర్టు ఈ తీర్పును ప్రకటిస్తోంది. సుజాత, ప్రతాప్‌ల వివాహం 16 సంవత్సరాల క్రితం జరిగింది. వారికి పిల్లలు పుట్టలేదు. తన చెల్లెలి కొడుకుని దత్తత తీసుకుందామని ప్రతాప్, ఎవరైనా అనాధని తీసుకుందామని సుజాత వివాదపడ్డారు. ఎవరిని దత్తత తీసుకోవాలన్న విషయంలో వారికి అంగీకారం కుదరలేదు. చివరికి ప్రతాప్ ఆయన అనుకున్నట్లు తన చెల్లెలి కొడుకుని దత్తత తీసుకున్నాడు. ఆ దత్తతని రిజిస్ట్రేషన్ కూడా చేయించాడు. ఆ దత్తత స్వీకారానికి సుజాత సమ్మతి ఇవ్వలేదని ఆమె తరపు న్యాయవాది వాదనలు చేసారు. కోర్టు ముందున్న సాక్ష్యాలను పరిశీలించినపుడు రెండు విషయాలు స్పష్టమవుతున్నాయి. దత్తత స్వీకారం రోజున సుజాత ప్రతాప్ ఇంట్లో ఉన్నది వాస్తవమే అయినప్పటికీ ఆమె ఆ దత్తత స్వీకారాన్ని వ్యతిరేకించి వెంటనే తన పుట్టింటికి వెళ్ళిపోయింది. ఆమె లేకుండానే ప్రతాప్ తన చెల్లెలి కొడుకుని దత్తత తీసుకున్నాడు. అంతేకాదు, ఆ దత్తతని రిజిస్ట్రేషన్‌కూడా చేయించాడు. అంటే దత్తత స్వీకారానికి సుజాత తన సమ్మతిని ఇవ్వలేదని స్పష్టమవుతుంది. దత్తత మరియు మనోవర్తి చట్టంలోని సెక్షన్ 7 ప్రకారం స్థిరచిత్తం కలిగిన మైనర్ కాని హిందూ పురుషుడు దత్తత తీసుకునే అధికారం కలిగివున్నప్పటికీ ఆ దత్తత స్వీకారానికి అతని భార్య సమ్మతి అవసరం. తన చెల్లెలి కొడుకుని ప్రతివాది ప్రతాప్ దత్తత తీసుకోవడానికి వాది సుజాత సమ్మతిని ఇవ్వలేదు. ఇంకా చెప్పాలంటే ఆ దత్తత తీసుకోవడాన్ని ఆమె వ్యతిరేకించి, దత్తత స్వీకారం ప్రారంభించకముందే తన పుట్టింటికి వెళ్ళిపోయింది. అందుకని ఆ దత్తత స్వీకారానికి ఎలాంటి విలువా లేదు. ఆ దత్తత స్వీకార పత్రం చెల్లదు. అందుకని వాది సుజాత కోరినట్టు దత్తత స్వీకారం చెల్లదూ అని ప్రకటిస్తూ వాది దావాని డిక్రీ చేయడమైనది. ✳

కావలసిన వస్తువులు:

బొంబాయి రవ్వ	:	రెండు గ్లాసులు
పంచదార	:	మూడు గ్లాసులు
డాల్డా లేక నెయ్యి	:	ఒక గ్లాసు
పాలు, నీళ్ళు కలిపి	:	నాలుగు గ్లాసులు
యాలకులు	:	10
కిస్మిస్	:	10 గ్రాములు
జీడిపప్పు	:	10 గ్రాములు

బొంబాయి రవ్వ స్వీట్ కేసరి

తయారుచేసే విధానం: బొంబాయి రవ్వ రెండు స్పూన్లు నెయ్యి వేసి దోరగా వేయించుకోవాలి. జీడిపప్పు, కిస్మిస్ కూడా వేయించుకుని పక్కన పెట్టుకోవాలి. యాలకులు పొడి కొట్టుకోవాలి. పంచదార మిక్సీలో పొడి కొట్టుకోవాలి. పాలు, నీళ్ళు కలిపి గిన్నెలో పోసి కాగనివ్వాలి. పాలు కాగిన తరువాత రవ్వపోసి కలపాలి. నెయ్యి కూడా పోయాలి. పంచదార కూడా పోసి కలపాలి. గట్టిగా అయ్యాక యాలకుల పొడివేసి కలిపి దించాలి. ఒక పళ్ళెంలో అడుగున నెయ్యి రాసి ఈ మిశ్రమాన్ని అందులో వేసి చదరంగా చెయ్యాలి. దీని మీద జీడిపప్పు, కిస్మిస్ గుచ్చి అలంకరించాలి. మనకు ఇష్టమైన షేపులో కట్ చేసుకోవాలి.

కావలసిన వస్తువులు:

సగ్గుబియ్యం	:	125 గ్రాములు	జీలకర్ర	:	అర స్పూన్
బంగాళాదుంప	:	ఒకటి పెద్దది	కారం	:	ఒక స్పూన్
వేరుశనగపప్పు	:	పావు కిలో	ఉప్పు	:	తగినంత

సగ్గుబియ్యం వడలు

తయారుచేసే విధానం: ఒక గంట ముందుగా సగ్గుబియ్యాన్ని నీళ్ళలో నానబెట్టుకోవాలి. నానిన తరువాత సగ్గుబియ్యం రెట్టింపు అవుతాయి. పచ్చి వేరుశనగపప్పును రోట్లో వేసి మెత్తగా దంచి పిండిని పళ్ళెంలోకి తీసుకోవాలి. బంగాళా దుంపను ఉడకబెట్టి పై పొట్టు తీసి దానిని కూడా పిండిలా నలపాలి. తరువాత నానిన సగ్గుబియ్యం, దంచిపెట్టుకున్న వేరుశనగ పిండి, బంగాళాదుంప పొడి, కారం, ఉప్పు, జీలకర్ర వేసి బాగా కలపాలి. కొంచెం నీళ్ళుపోసి మెత్తగా చేసిన తరువాత ఉండలుగా చేసి దానిని వడలు మాదిరిగా తట్టి నూనెలో వేసి ఎర్రగా వేగిన తరువాత తీయాలి.

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలం స్నేహం చెయ్యాలని వుందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్ ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్: **కలం స్నేహం**, బాలనేస్తాలు, ప్రజాశక్తి స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : తుగావే రాగిణి
వయసు : 14 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : పాటలు పాడడం, ప్రజాశక్తి చదవడం, రాయడం, బ్రెయిన్ ఆఫ్ ఆంధ్రా చూడడం, ముగ్గులేయడం
లక్ష్యం : ఐపిఎస్ కావడం.
చిరునామా: తుగావే రాగిణి డాటరాఫ్ టి.విలాస్, సాయివిలాస్ ఫుట్‌వేర్, ఇంటి నెం. 3-107/1, ఇందిరానగర్, మెదక్ రోడ్, సిద్ధిపేట్-502103.

పేరు : బిరుదుల సంతోష్‌కుమార్
వయసు : 15 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : పుస్తక పఠనం, క్రికెట్ ఆడడం, కలం స్నేహం చేయడం
స్కూలు : శ్రీ వివేకానంద విద్యాలయం
చిరునామా : బిరుదుల సంతోష్‌కుమార్ సన్నాఫ్ బి.ధర్మయ్య, ఇంటి నెం.5-8 ఆంధ్రాకాలనీ, ఊత్కూరు (గ్రా), లక్షెట్టిపేట (మం), ఆదిలాబాద్ -504215.

పేరు : షేక్ అల్లాబక్ష్
వయసు : 13 సం॥
చదువు : 8వ తరగతి
హాబీలు : బొమ్మలేయడం, షటిల్ ఆడడం
స్కూలు : ఆదిత్య ఉన్నత పాఠశాల
చిరునామా : షేక్ అల్లాబక్ష్ 8వ తరగతి, సన్నాఫ్ షేక్ రహంతుల్లా, పామూరు, ప్రకాశం-523108.

పేరు : జి.హదస్సా శాలిని
వయసు : 14సం॥
చదువు : 9వ తరగతి
హాబీలు : పుస్తకాలు చదవడం, ఆటలు ఆడటం, పాటలు పాడడం
లక్ష్యం : డాక్టర్ కావడం.
స్కూలు : శాంతి నికేతన్ స్కూల్
చిరునామా : జి.హదస్సా శాలిని, డాటరాఫ్ జి.పరదేశి, విశ్వనాథపురం (గ్రా), పొదిలి (మం), ప్రకాశం - 523290.

పేరు : ఋషిపాక రాజ్‌కుమార్
వయసు : 14 సం॥
చదువు : 8వ తరగతి
హాబీలు : క్రికెట్ ఆడడం, పుస్తకాలు చదవడం, టీవీ చూడడం
లక్ష్యం : కలెక్టర్ కావడం
చిరునామా : ఋషిపాక రాజ్‌కుమార్, 8వ తరగతి, సన్నాఫ్ ఆర్.రాములు, సిద్ధార్థ హైస్కూల్, బావాజీగూడెం (గ్రా), వరంగల్.

పేరు : జి.రవితేజ
వయసు : 10 సం॥
చదువు : 5వ తరగతి
హాబీలు : క్రికెట్ ఆడటం, అల్లరి చేయడం, ప్రజాశక్తి ఆదివారం పుస్తకం చదవడం
స్కూలు : శ్రీవాణీ & రమా స్కూల్
చిరునామా : జి.రవితేజ, 5వ తరగతి, సన్నాఫ్ జి.వెంకటేశ్వర్లు, మేడపి (గ్రా), త్రిపురాంతకం (మం), ప్రకాశం.

పేరు : బి.మంజునాథరాజు
వయసు : 16 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : చెస్ ఆడడం, పేపరు చదవడం, టీవీ చూడడం
లక్ష్యం : ఇంజనీర్ కావడం
స్కూలు : శ్రీ సత్యసాయి హైస్కూల్
చిరునామా : బి.మంజునాథరాజు, 10వ తరగతి, సన్నాఫ్ బి.వెంకట చలపతి రాజు, పాపేపల్లి (గ్రా), వి.కోట (పోస్టు, మండలం), చిత్తూరు.

పేరు : షేక్ సుబాని
వయసు : 12 సం॥
చదువు : 7వ తరగతి
హాబీలు : డ్రాయింగ్ వేయడం, కవితలు రాయడం
లక్ష్యం : కలెక్టర్ కావడం
చిరునామా : షేక్ సుబాని, 7వ తరగతి, సన్నాఫ్ షేక్ కాలేషావలి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొత్తపట్నం.